https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే చాటింపు

నారద్ధంలో

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 38 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ శనివారం,నవంబర్,7, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



నగర ప్రయాణికులకు ప్రభుత్వం దీపావళి కానుకగా

మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరల్లో భారీ తగ్గింపు

హైదరాబాద్, నవంబర్ 6: నగర ప్రయాణికులకు దీపావళి కానుకగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇప్పటివరకు నెలవారీ ఉమ్మడి పాస్ ధర రూ.8,500 ఉండగా, దానిని ఏకంగా రూ.4,000కు తగ్గించారు. దీంతో ప్రయాణికులకు నెలకు రూ.4,500 వరకు ఆదా కానుంది. అలాగే.. రోజువారీ పాస్ ధరను కూడా రూ.400 నుంచి రూ.275కు తగ్గించారు. ధరల తగ్గింపుతో ప్రతిరోజూ మెట్రో, ఆర్టీసీ సేవలను వినియోగించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గనుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కొత్త విధానం ప్రకారం.. రోజువారీ పాస్‌లో మెట్రో ప్రయాణానికి రూ.200, ఆర్టీసీ ప్రయాణానికి రూ.75 కేటాయించారు. ఈ పాస్ ద్వారా రోజుకు నాలుగు సింగిల్ జర్నీలు చేసుకునే అవకాశం కల్పించారు. ఇక నెలవారీ ఉమ్మడి పాస్‌తో గరిష్టంగా



50 రౌండ్ ట్రిప్పులు ప్రయాణించవచ్చు. తగ్గించిన కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ వివరాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

మీర్‌పేట్ డబుల్ మర్డర్ కేసు ఛేదించిన పోలీసులు..

నిందితుడి అరెస్ట్...

హైదరాబాద్, నవంబర్ 6: మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన డబుల్ మర్డర్ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడు మహమ్మద్ సిద్ధిఖీని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి కత్తి,వ్యాగన్-ఆర్ కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 4న అత్తంటికి వెళ్లిన సిద్ధిఖీ.. అత్త, బావమరిది మహమ్మద్ యూసుఫ్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నిందితుడి అత్త నిరంజన్ బీ, బావమరిది యూసుఫ్ అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే తీవ్రంగా గాయపడిన బావమరది భార్య మహమ్మద్ రేష్మా (39) ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. భార్య కుటుంబంతో తలెత్తిన వివాదాలే హత్యలకు కారణంగా పోలీసులు గుర్తించారు. పెద్దల ముందు అవమానించారనే కక్షతో ముగ్గురిని హత్య చేసేందుకు నిందితుడు కుట్రకు ప్లాన్ చేసినట్లు విచారణలో బయటపడింది. కాగా.. షరీఫ్‌నగర్‌కు చెందిన భార్యాభర్తలు షేక్ మహమ్మద్ సిద్ధిఖీ, నూర్ బేగం మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. తరచూ భర్త గొడవపడుతుండటంతో ఈనెల 4న నూర్ బేగం పుట్టింటికి వెళ్లింది. అదే రోజు ఉదయం తన భర్తతో తమకు ప్రాణహానీ ఉందంటూ

పోలీసులకు ఫిర్యాదు చేసింది.
సాయంత్రం సమయంలో అత్తింటికి చేరుకున్న సిద్ధిఖీ.. కత్తితో అత్త, బావమరది, బావమరిది భార్యపై విచారక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అత్త, బావమరిది అక్కడికక్కడే మృతి చెందగా.. బావమరది భార్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది.

హైదరాబాద్‌లో డీటీఎఫ్ దాడులు..

భారీగా డ్రగ్స్ పట్టివేత, ఒకరి అరెస్ట్



హైదరాబాద్, నవంబర్ 6: భాగ్యనగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. డీటీఎఫ్ టీమ్ దాడుల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. నగరంలోని కుత్బుల్లాపూర్‌లో డ్రగ్స్ విక్రయాలపై డీటీఎఫ్ బృందం దాడులు నిర్వహించింది. కారులో డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకుంది. నిందితుడిని కుష్ లోయగా గుర్తించారు. అతడి వద్ద నుంచి భారీ మొత్తంలో వివిధ రకాల డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీటీఎఫ్ బృందం నిర్వహించిన తనిఖీల్లో నిందితుడి వద్ద 58 గ్రాముల ఓజీ కుష్ లభ్యమైంది.
అదేవిధంగా 0.95 గ్రాముల ఎండీఎంఏ, రెండు ఎల్ఎస్‌డీ బ్లాట్స్‌ను అధికారులు పట్టుకున్నారు. నిందితుడు డ్రగ్స్ విక్రయాలకు ఉపయోగిస్తున్న కారు, సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, కారు, సెల్‌ఫోన్లతో పాటు నిందితుడిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు డీటీఎఫ్ బృందం అప్పగించింది. కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తీసుకొచ్చాడు, అతడికి ఇంకా ఎవరితో అయినా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగనుంది.

3 రాష్ట్రాల మధ్య 60 ఏళ్లుగా విద్యుత్తు వివాదం.. పరిష్కరించిన సుప్రీంకోర్టు



హిమాచల్ ప్రదేశ్ మధ్య భాక్రా నంగల్ ప్రాజెక్టు విద్యుత్తు సరఫరా అంశంలో వివాదం ఉన్నది. 1966 నుంచి వస్తున్న ఆ సమస్యను ఇవాళ సుప్రీం పరిష్కరించింది.
కేంద్రం ప్రతిపాదించిన క్యాష్‌లెస్ పేమెంట్ విధానాన్ని సుప్రీం కోర్టు ఆమోదించింది. పంజాబ్ , హర్యానా రాష్ట్రాలు.. హిమాచల్ ప్రదేశ్‌కు నగదు బదులుగా విద్యుత్తును అందజేసేందుకు ముందుకు వచ్చాయి. అయితే ఆ ప్రతిపాదనను సుప్రీంలోని త్రిసభ్య ధర్మాసనం అంగీకరించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రతిపాదనను ఆహ్వానించింది. అయితే ఆ ప్రతిపాదన ప్రకారం పంజాబ్, హర్యానా రాష్ట్రాలు రాబోయే 20 ఏళ్లలో హిమాచల్ ప్రదేశ్‌కు సుమారు 11,973 మిలియన్ల యూనిట్ల విద్యుత్తును సరఫరా చేయనున్నాయి. 2011 నాటి సుప్రీం తీర్పును అనుసరించే ఈ ఏర్పాటు చేసినట్లు ధర్మాసనం వెల్లడించింది.

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు..

ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే

- కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్న హరీశ్‌రావు- పరిస్థితిని ‘రేవంత్ వృష్టి’గా అభివర్ణన- దేవాదుల నుంచి 18 టీఎంసీలే ఎత్తిపోశారని ఆరోపణ- కల్వకుర్తి మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని విమర్శ-పంటల బీమా అమలు చేయలేదని కాంగ్రెస్‌పై ధ్వజం

హైదరాబాద్,నవంబర్,06 :రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. “ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి” అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నా రని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని



విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

తెలంగాణ కాంగ్రెస్ పంచాయతీలపై

ఏఐసీసీకి టీపీసీసీ చీఫ్ నివేదిక

హైదరాబాద్,నవంబర్ 6: తెలంగాణ కాంగ్రెస్‌లో జరుగుతున్న పంచాయతీలపై ఏఐసీసీకి రిపోర్ట్ చేరింది. అన్ని పంచాయతీలపై ముందస్తు సమాచారంతో అధిష్ఠానానికి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రిపోర్ట్ పంపించారు. మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావులకు మధ్య జరిగిన వివాదంపై నివేదిక పంపారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా రిపోర్ట్ పంపించారు. కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ అంశాన్ని హైకమాండ్‌కు చేరవేశారు. అంతేకాకుండా పెద్దపల్లిలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ అధిష్ఠానానికి పీసీసీ చీఫ్ రిపోర్ట్ పంపారు. త్వరలోనే అన్ని పంచాయతీలపై ఇరువర్గాలతో మాట్లాడి పూర్తి నివేదికను పీసీసీ చీఫ్ తయారు చేయనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న ఇబ్బందులన్నింటినీ పరిష్కరించే యోచనలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఉన్నట్లు తెలుస్తోంది. దాంట్లో భాగంగా పార్టీలో ఎక్కడెక్కడ గొడవలు, ఇబ్బందులు ఉన్నాయి.. అలాగే ఆధిపత్య పోరు ఎక్కడ ఉందనే దానిపై లిస్ట్ అవుట్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య నెలకొన్న వివాదాన్ని సర్దుమణిగించేందుకు ప్రయత్నం చేశారు. అయితే నిన్న కేబినెట్ సమావేశం ఉండటంతో



మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీభవన్‌కు రాలేదు.
అలాగే.. పెద్దపల్లి కాంగ్రెస్ పంచాయతీ గాంధీభవన్‌కు చేరింది. ఎంపీ వంశీ కృష్ణ, మంత్రి శ్రీధర్ బాబు మధ్య చాలా రోజులుగా కోల్డ్ వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈరోజు గాంధీభవన్‌కు రావాల్సిందిగా మంత్రి, ఎంపీని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. వంశీ వర్గం నేతల సస్పెన్షన్, మంత్రి శ్రీధర్ బాబుకు ఎంపీ రాసిన లేఖ.. ఇద్దరి మధ్య తీవ్ర విభేదాలకు కారణంగా మారిందని చర్చ జరుగుతోంది.

గోదావరి పుష్కరాల

పనుల నాణ్యతలో రాజీపడొద్దు..

అధికారులకు మంత్రి అడ్లూరి ఆదేశాలు



హైదరాబాద్, నవంబరు 6 గోదావరి పుష్కరాల పనుల్లో జాప్యానికి తావు ఇవ్వవద్దని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ . అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆజ్ఞాపించారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధి పనులపై మంత్రి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గోదావరి పుష్కరాల పనుల నాణ్యతలో రాజీపడొద్దని మంత్రి అడ్లూరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
ఆయా శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఘాట్లు, రహదారులు, పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలను కల్పించాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. గోదావరి పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.1,000 కోట్లను కేటాయించినట్లు ప్రకటించారు. ధర్మపురి అభివృద్ధికి సుమారు రూ.226 కోట్లతో ఆయా పనులకు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. ధర్మపురిలో 470 మీటర్ల మేర కొత్త స్నాన ఘాట్ల అభివృద్ధి ప్రతిపాదనలు చేస్తున్నామని వివరించారు. 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు గోదావరి పుష్కరాలు జరుగుతాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు

ఎస్టీ కమిషన్ ప్రాధాన్యం ఇవ్వాలి: కవిత



హైదరాబాద్,నవంబర్,06 :తెలంగాణలో ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తమ పార్టీ డిమాండ్ చేసిందని, అందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు డిమాండ్ చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఉమ్మడి కమిషన్‌తో ఎస్సీ, ఎస్టీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని కవిత వ్యాఖ్యానించారు. ఎస్సీలు సామాజిక అణచివేతను ఎదుర్కొంటుంటే.. ఆదివాసీలు అడవులకు దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల జల్, జంగిల్, జమీన్ హక్కులను కాపాడేందుకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ అవసరమని ఆమె మరోసారి స్పష్టం చేశారు. గిరిజనుల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ప్రాధాన్యత ఇవ్వాలని కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. కాగా, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలు, హక్కులను కాపాడేందుకు వారికి వేర్వేరు కమిషన్లు అవసరమని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. ఈ మేరకు నవంబర్ 5న జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ‘తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్టం-2003’ను రద్దు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దాని స్థానంలో ‘తెలంగాణ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చట్టం-2026’, ‘తెలంగాణ షెడ్యూల్డ్ తెగల కమిషన్ చట్టం-2026’లను తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్సుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జాతీయ స్థాయిలో ఆర్టికల్ 338, 338ఏ కింద జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోనూ ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

దిల్సుఖ్నగర్ లో వేగా జ్యువెలర్స్ నూతన షోరూమ్ వైభవంగా శుభారంభం



దిల్సుఖ్నగర్ /హైదరాబాద్, నవంబర్ 6 (డీకే చాటింపు) ఆభరణాల ప్రియులకు శుభవార్త ప్రముఖ ఆభరణాల సంస్థగా పేరొందిన వేగా జ్యువెలర్స్ తమ నూతన షోరూమ్ను హైదరాబాద్లోని దిల్సుఖ్నగర్లో ఈరోజు అత్యంత వైభవంగా ప్రారంభించారు. వేగా జ్యువెలర్స్ ప్రచారకర్త, సంస్థకు అత్యంత ఆత్మీయులు నందమూరి బాలకృష్ణ (బాలయ్య బాబు) శు భాశీస్సులతో నూతన షోరూం ను ప్రముఖ సినీ నటి ప్రగ్యా జైస్వాల్ ప్రారంభించారు. అనంతరం షోరూం నందు తిరుగుతూ ఖాతాదారులతో కలసి ఆమె సందడి చేసారు.నూతన షోరూం ప్రారంభోత్సవం కార్యక్రమంలో స్థంస చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్.మేనేజింగ్ డైరక్టర్ శ్రీనవీన్ వనమా, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సుధాకర్ వనమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో ఇది మా 7వ షోరూం అని, హైదరాబాద్ నగరంలో రెండవదని తమ ఖాతాదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రవేశపెట్టామని చెప్పారు. ప్రారంభోత్సవ శుభ సందర్భంగా బంగారు ఆభరణాలు వేస్టేజీ 2.99% నుంచి 11.99% వరకు ఉంటుందని మరియు తయారీ (మేకింగ్) చార్జీలు ఉండవని తెలిపారు వజ్రాల ఆభరణాల క్యారట్ ధర రూ.47,999/- ఉంటుందని, ఈ ప్రత్యేక ఆకర్షణీయమైన ఆఫర్లు 6 నవంబర్ నుంచి 30 నవంబర్ 2026 వరకు మాత్రమే ఉంటాయని చెప్పారు. నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా అద్భుతమైన మెగా గోల్డ్ లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని మొత్తం 100 మంది విజేతలకు ఒక్కొక్కరికి 5 గ్రాముల 24 క్యారట్ బంగారం చొప్పున మొత్తం 500 గ్రాముల బంగారం విజేతలకు అందించనున్నామని వారు వివరించారు.ఈ నూతన షోరూమ్ లో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సరికొత్త డిజైన్లతో కూడిన బంగారు, వజ్రాభరణాలు, సంప్రదాయ మరియు ఆధునిక నగల కలెక్షన్లు అందుబాటులో ఉంచామని, బంగారు, వజ్రాభరణాల కొనుగోలుపై ప్రత్యేక ప్రయోజనాలు, ఆకర్షణీయమైన డిస్కౌంట్లు మరియు ఇతర ప్రత్యేక ఆఫర్లు తెలుసుకుని, అందరు ఈ సువర్ణ అవకాశం వినియోగించుకోవలసినదిగా వారు కోరుతున్నారు. వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, ప్రత్యేక సందర్భాలకు తగిన విభిన్నమైన ఆభరణాల కలెక్షన్లతో వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించడమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. దిల్సుఖ్నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, ఆభరణాల ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వేగా జ్యువెలర్స్ నూతన షోరూమ్ ను సందర్శించి ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్లను పొందాలని సంస్థ ఆహ్వానిస్తోంది. రాబోయే వివాహాల సీజన్ కొరకు ప్రత్యేకమైన డిజైన్స్ లో అపురూపమైన బ్రైడల్ కలెక్షన్స్ ఈ ఆఫర్ కాలంలో అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

ఎస్.ఎల్.బీ.సీ మార్గ దర్శకాల మేరకు
పంట రుణాలు రీషెడ్యూల్ చేయాలి
రైతాంగానికి బాసటగా నిలువాలి :కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 06 (డీకే చాటింపు): ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో జిల్లా రైతాంగానికి బ్యాంకర్లు బాసటగా నిలువాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోశు క్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఎల్ నినో వల్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్న నేపథ్యం లో పంట రుణాల రీషెడ్యూల్, రైతులకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన ఆర్థిక సహాయంపై ఈ సమా వేశంలో చర్చించారు. ఎస్.ఎల్.బీ.సీ జారీ చేసిన తాజా మార్గ దర్శకాల మేరకు జిల్లా రైతాంగానికి ప్రయోజ నం చేకూరేలా బ్యాంక ర్లు చొరవ చూపాల న్నారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో రైతులకు బ్యాంకర్లు బాసటగా నిలువాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్యాంకర్ల తో సమన్వయము పెంపొందించుకుని అర్హులైన రైతులకు సకాలంలో రుణాల రీషెడ్యూల్, కొత్త రుణాల పంపిణీ, అవసరమైన సహకా రం అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధి కారులనుఆదేశించారు. ప్రభుత్వంచే గుర్తించ బడిన జిల్లాలోని 18 సాధారణ కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు పంట రుణాలను ఎస్.ఎల్.బీ.సీ మార్గదర్శకాల ప్రకారం రీషెడ్యూల్ చేసి, 12 నెలల మారటోరియం కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతులకు కొత్తగా పంట రుణాలు సకాలంలో అందజేసి, వారికి అండగా నిలవాలని సూచించారు.వర్షాభావం దృష్ట్యా యాసంగి లో వరి సాగుకు బదు లుగా ఆరుతడి పంట లు మాత్రమే సాగు చేయాలని రైతులకు సూచించడం జరిగింద న్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వరికి ప్రత్యామ్నాయంగా ఇతర అనువైన పంటలను సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు పంట రుణాల రూపంలో ఆర్థిక వెసులుబాటు కల్పించాలన్నారు. పశువుల మేత అవసరాలను దృష్టిలో ఉంచుకుని పశు గ్రాస పంటల సాగును చేపట్టేందుకు ముందుకు వచ్చే వారికి కూడా రుణాలు అందిస్తూ ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. దీనివల్ల పాడి పశువుల ద్వారా రైతులు కరువు ప్రభావం నుండి కొంతవరకు బయటపడేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం సాధారణ కరువు ప్రాంతాలుగా గుర్తించిన జిల్లాలోని 18 మండలాలకే పరిమితం కాకుండా, ఇతర మండలాల్లో కూడా కరువు ప్రభావానికి గురైన రైతులు ఉన్నట్లయితే, వ్యవసాయ శాఖ అధికారులు వారిని గుర్తించి వివరాలు సమర్పించిన పక్షంలో, నిబంధనల ప్రకారం వారికి కూడా రుణాల రీషెడ్యూల్ ప్రయోజనాలు వర్తించేలా బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్.బీ.ఐ ప్రతినిధి రాములు, నాబార్డు డీ.డీ.ఎం ప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, వ్యవసాయ శాఖ ఏడీ వీరస్వామి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కే.రాజు, అన్ని బ్యాంకుల జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

25వ రోజు చేసినం నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమ్మె



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్6(డీకే చాటింపు):శుక్రవారం తో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమ్మె 25 రోజులకు చేరింది. ధనతెరస్ సందర్భంగా, వైద్య వృత్తికి ఆధ్యుడైన ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని సమ్మెలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఉద్యోగుల సమ్మె25వ రోజుకు చేరిన 17 వేల మంది ఉద్యోగుల ఆర్త నాదాలు ప్రభుత్వానికి వినబడడం లేదా అని అన్నారు. ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగు లపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడి నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగలకు స్కేల్ పోస్ట్ ఇవ్వాలని ,కుటుంబ ఆరోగ్య కార్డు అందిం చాలని, మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీసీ యువజన సంఘం
కార్యవర్గ సమావేశం ఘనంగా విజయవంతం



హైదరాబాద్, నవంబర్ 6:(డీకే చాటింపు) నగరంలోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్ లో ఈరోజు ఉ దయం 10 గంటలకు బీసీ యువజన సంఘం కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, బీసీ ఐకాస (బీసీ జేఏసీ) చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమం నికి ముఖ్య అతిథులుగా: వీ. హనుమంతరావు (వి. హనుమంత రావు) సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ, తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ సలహాదారు సిరికొండ మధుసూదనాచారి– సీనియర్ రాజకీయ నాయకులు, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత కనకాల శ్యామ్ కురుమ – జాతీయ అధ్యక్షులు, జాతీయ బీసీ యువజన సంఘ ఈడిగ శ్రీనివాస్ గౌడ్ – రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, బీసీ యువజన సంఘం వీరు హాజరై బీసీల ఐక్యత, యువత భవిష్యత్తు, 42% బీసీ రిజర్వేషన్ సాధనపై దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుల వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. వారి ఆశీస్సులతో, మార్గదర్శకత్వంతో ఈ సమావేశం మరింత ఉత్సాహభరితంగా సాగింది.ఈ కార్యక్రమంలో అతిథులుగా అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాథం , అంబర్ పేట అధ్యక్షులు కొల్లోజు సురేష్ చారి , అక్కినపల్లి లక్ష్మణ చారి, సలహాదారులు దోనాల కాళిదాస్, కౌలె రఘునాథ్ , గౌరవ అధ్యక్షురాలు పట్నాల సావిత్రి గారు, అధికార ప్రతినిధి శ కస్తూరి శ్రావణి , వనపర్తి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి కంసాలి అరుణ పాల్గొని, బీసీ – విశ్వకర్మ ఐక్యతకు పిలుపునిచ్చారు.బీసీ కులాలన్నీ ఒకే తాటిపైకి వచ్చి హక్కుల సాధన కోసం పోరాడాలని, రాబోయే రోజుల్లో గ్రామ గ్రామాన సంఘాన్ని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా తీర్మానించడం జరిగింది.

నూతన మండి హోటల్ ప్రారభించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి (డికే చాటింపు)పట్టణంలోని కన్నాల హైవే పై ఏర్పాటైన నూతన మూన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఉ మండి దాబా హోటల్ ను శు క్రవారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మండి యాజమాన్యానికి దుర్గం చిన్నయ్య శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిసీసీ ప్రచార కమిటీ కొకన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్,కౌన్సిలర్ ధారావత్ తిరుమల వాసు , నాయకులు సుదర్శన్,సుందర్ రావు,కలిం, మండి హోటల్ నిర్వాహకులు చాంద్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుక రవాణాకు
అనుమతులు ఇవ్వాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 06(డీకే చాటింపు): జిల్లాలోని వివిధ క్వారీ ల నుండి నిబంధనలకు అనుగుణంగానే ఇసుక రవాణాకు అనుమతిం చడం జరుగుతోందని, ఈ విషయంలోఎక్క డైనా నిబంధనల ఉల్లం ఘనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.రెవెన్యూ, మైనింగ్, ఇంజినీ రింగ్ తదితర శాఖల అధికారులు హాజర య్యారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడు తూ, ఇసుక రీచ్ లను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులను ఆదే శించారు.మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకిం గ్ ద్వారా ఇసుక కేటా యింపులు జరగాలని, ఇసుక రవాణా విష యంలోఎలాంటి పొర పాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టంచేశారు. ప్రభుత్వ నిబంధనలను తూచ తప్పకుండా అమల య్యేలా చూడాలని, అన్ని శాఖల అధికారు ల సమన్వయంతో పని చేస్తూ అక్రమాలకు తావు లేకుండా కట్టు దిట్టంగా వ్యవహరించా లన్నారు.యంగ్ ఇండి యా ఇంటిగ్రేటెడ్ రెసిడె న్షియల్ స్కూల్స్, జవ హర్ నవోదయ విద్యా లయం భవన సము దాయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను నిర్దేశిత ఇసుక రీచ్ ల నుండి తరలించేందుకు అను మతించినందున ఆటం కాలు లేకుండా చూడా లన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ గీత, నిజామా బాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, మైనింగ్ అధికారి బాలు, రెవెన్యూ, ఇంజి నీరింగ్ విభాగాల అధి కారులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలి....



జనగామ / లింగాల ఘనపూర్, నవంబర్ 6 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత వైభవోపేతంగా జీడికల్ శ్రీ వీరాచల రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని, ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వసతులు కల్పించాలని ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని లింగాల ఘనపూర్ మండలం జీడికల్ గ్రామంలోని శ్రీ వీరాచల రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జీడికల్ రామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రజలు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25వ రోజుకు చేరుకున్న ఎన్హెచ్ఎం జేఏసీ నిరవధిక సమ్మె
-ధన్వంతరి జయంతి సందర్భంగా ధర్నా శిబిరంలో ధన్వంతరి హోమం...




నారాయణపేట,(డీకే చాటింపు): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్హెచ్ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 25వ, రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా ధన్వంతరి జయంతి,ధన త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్నా శిబిరం వద్ద ప్రత్యేకంగా ధన్వంతరి హోమం నిర్వహించారు. ఆరోగ్యానికి అధిదేవతగా భావించే శ్రీ ధన్వంతరి స్వామిని పూజిస్తూ ఉద్యోగులు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉ ండాలని,సమాజంలో ఆరోగ్య సంపద వెల్లివిరియాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అదే సమయంలో తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరి,ఉద్యోగుల జీవితాల్లో కూడా వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.గత 25 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి తమ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ లభించకపోవడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఎం యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకట రమణ,కోశాధికారి రాఘవేందర్,సభ్యులు వినోద్,కిరీటి,తిరుపతి, మోనేష్ చారి,విరోజా, రేణుక,సౌందర్య, గాయత్రి,నవీన, సుమన,రామేశ్వరి, ఆశాజ్యోతి,సావిత్రమ్మ, రామలింగమ్మ, నాగజ్యోతి,సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రికెట్ పోటీలకు ఎం.ఎం.సి.సి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక..



బెల్లంపల్లి (డికే చాటింపు)మంచిర్యాల జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి. ఎఫ్) అండర్ 14 క్రికెట్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన బెల్లంపల్లి ఎంఎంసీసీ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు,కోచ్ గౌతం తెలిపారు. మంచిర్యాల జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ గ్రౌండ్స్ లో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో తమ విద్యార్థులు రెడ్డి రిత్విక్, సానా మోక్షిత్జి, జిల్లపల్లి విజయ్, ఎండి మెహరాన్ ఆదిలాబాద్ లో జరిగే జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. జోనల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.



భగవాన్ ధన్వంతరి జయంతి



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్6(డీకే చాటింపు):నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో భగవాన్ ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహించినట్టు జిల్లా ఆయుష్ ఇంచార్జ్ డాక్టర్ గంగాదాస్ తెలిపారు. ధన్వంతరి విగ్రహానికి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణమోహన్ పూలమాలవేశారు.ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల వైద్యులు విగ్రహ దాత డాక్టర్ డీఎల్ఎన్ స్వామి, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్రీవాణి జ్యోత్స్న అరవింద్ విజయభాస్కర్ రామకృష్ణనాయనా ఉమా ఆర్బిఎస్కేఎన్ఆర్హెచ్ ఎం డిపిఎం వందన, ఆయుష్ ఫార్మసిస్ట్ న్యావనంది పురుషోత్తం, సామాజిక కార్యకర్తలు కొట్టు రమేష్ రాజేందర్ శ్రీనివాస్ గౌడ్ ఆయుష్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శనివారం,నవంబర్,7, 2026

పదేళ్లలో 61 యుద్ధాలు... ముగింపు ఎప్పుడు..?

భారత ప్రధాని నరేంద్రమోదీ నాలుగేళ్ల క్రితం రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం కాగానే ఒక ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రతినిధులతో మాట్లాడి ఇది యుద్ధాల యుగం కాదని తెలిపారు. మోదీ ఈ మాట అన్నప్పటికీ ఆయన అంచనా తప్పింది. 2016 నుంచి 2026 మార్చి వరకు చూసినట్లయితే ప్రపంచ వ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయి. అంతర్జాతీయంగా యుద్ధాలను అధ్యయనం చేసే సంస్థ 78 దేశాలు పదేళ్లలో యుద్ధాలు చేశాయి. ఈ 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయి. ఇందులో ప్రభుత్వాలు ఉన్నాయి. ఉగ్రవాద సంస్థలు ఉన్నాయి. స్వతంత్రం కోసం పోరాడే సంస్థల ఉన్నాయి. 2016?2026లో 61 యుద్ధాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వాలు, ఉగ్రవాద గుండాలు, విముక్తి సంస్థలు పాల్గొన్నాయి. యూరప్‌లో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం మ్యాపులు మార్చింది. యూరప్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. మాజీ రష్యా ప్రాంతం అజర్‌బైజాన్, ఉక్రెయిన్‌లో, గల్ఫ్‌లో 1948 నుంచి అనేక దేశాలు యుద్ధాల్లో ఉన్నాయి. ఆఫ్రికాలో, ఆసియాలో యుద్ధాలు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల యుద్ధాలు, అంతర్గత తిరుగుబాట్లు జరిగాయి. ఉక్రెయిన్ యుద్ధం 2022, ఫిబ్రవరిలో మొదలైంది. 1948లో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన అతిపెద్ద యుద్ధం ఇదే. మ్యాపును మార్చే యుద్ధంగా చెప్పవచ్చు. 1990?91లో సోవియన్ యూనియన్ పతనం అయిన తర్వాత యూరప్ జాగ్రఫీ మారింది. ఇప్పుడు రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థిక నష్టం, జన నష్టం, సంపద నష్టం విపరీతంగా జరిగింది. ఏళ్ల తరబడి యుద్ధం కొనసాగడమే ఇందుకు కారణం.ఇజ్రాయెల్ 2023 అక్టోబర్‌లో హమాస్‌కు చెందిన ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి అనేక మందిని ఊచకోత కోశారు. దీంతో ఇజ్రాయెల్ గాజాపై దాడిచేసింది. ఇది రెండేళ్లు కొనసాగింది. ఆ తర్వాత లెబనాన్, హెజ్‌బొల్లాపై దాడి చేసింది. ఉగ్రవాద నాయకులను హతమార్చింది. ఇరాన్‌పైన కూడా 2025లో 12 రోజులు దాడి చేసింది. ఇదంతా గల్ఫ్‌లో ఉద్రిక్తలను తెలియజేస్తుంది. ఇక హూతీ రెబల్స్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా, అనుకూలంగా యూఏఈ కొట్టుకుంటున్నాయి. 2016 నుండి 2026 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.: రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణలు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించాయి.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటో దేశాలకు విస్తరించి, అణ్వస్త్ర దాడులకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్ చైనా (డోక్లాం, గల్వాన్) వంటి సరిహద్దు ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. సాంప్రదాయ ఆయుధాలతో పాటు, సైబర్ దాడులు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు (ఖతీనీజూజీణజీనిటజీ) కూడా ఈ యుగంలో భాగమయ్యాయిఇక సిరియా అంతర్యుద్ధం మొదట్లో తర్వాత టర్కీ సహకారంతో యుద్ధం చేస్తోంది. అమెరికా టర్కీ అనుకూల సున్నీ ప్రభుత్వం ఏర్పడేలా చేసింది. ఇజ్రాయెల్ దక్షిణ సిరియాపై దాడి చేసింది.ఇక భారత్‌లో 2017లో డోక్లాం, 2020లో గల్వాన్ సంఘటన జరిగాయి. ఇవి పెద్ద యుద్ధాలు కాకపోయినా ఏళ్లపాటు సైన్యం మోహరించాల్సి వచ్చింది. 2025లో ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. పాకిస్తాన్ శరణు వేడుకోవడంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను హోల్డ్‌లో పెట్టింది. 2025లో ఆఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌కు యుద్ధం జరిగింది. ఈ ఏడాది కూడా యుద్ధం కొనసాగుతోంది.ఆఫ్రికాలోనూ సూడాన్, సౌత్ సూడాన్, సోమాలియా, ఇథియోపియా, కాంగోలోనూ యుద్ధాలు జరుగుతున్నాయి. నార్త్ కొరియా, సౌత్ కొరియా, కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య యుద్ధాలు సాధారణం అయ్యాయి. అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య యుద్ధం జరిగింది. యుద్ధ రంగంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడే సైనికులు తీవ్రమైన శారీరిక, మానసిక అనుభవాలను ఎదుర్కొం టారు. మరణించిన వారి జీవితం అంతటితో సమసిపోయినా వారి కుటుంబాలకు అది చిరకాల బాధాకారణమౌతుంది. గాయపడినవారు మానసికంగాను, శారీరికంగాను, ఒకోమారు జీవితాంతం, అనేక వైకల్యాలతో బ్రతుకు గడపవలసి వస్తుందిజన నష్టంతో పాటు ఆస్తి నష్టం, ఆర్థిక వ్యవస్థ గందరగోళం, మానసిక వత్తిడులు సామాన్య జనానీకంపై ప్రగాఢమైన ప్రభావం కలిగి ఉంటాయి.



జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై కేబినెట్ లో చర్చే లేదు

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ధ్వజం



(డీకే చాటింపు,హైదరాబాద్): ప్రభుత్వం గురువారం సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఎలాంటి సానుకూల నిర్ణయం తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్ళు కావస్తుందని, ఇప్పటివరకు 25 కు పైగా కేబినెట్ సమావేశాలు జరిగాయని, అయినా ఏ ఒక్క సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్య పై చర్చ జరగలేదని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చే విషయంలో చిత్తశుద్ధి లేనట్లు కనిపిస్తుందని విమర్శించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, తన ఎన్నికల మేనిఫెస్టోలో ఐదు ప్రధాన హామీలను 27వ అంశంగా పొందుపర్చిందని సోమయ్య గుర్తుచేశారు.అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఆ హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హైదరా బాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం, అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జిల్లాల వారీగా ఇళ్ల స్థలాల కేటాయింపు, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అలాగే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించ డం లేదని అన్నారు.జర్నలిస్టులకు ఇచ్చిన హామీ లను అమలు చేయకపోగా, గతంలో ఉన్న సౌకర్యాలను సైతం ప్రభుత్వం తగ్గిస్తోందని సోమయ్య ఆరోపించారు. చిన్న, మధ్యతరహా పత్రికలు, పీరియాడికల్స్‌కు ప్రభుత్వ ప్రకటనలు నిలిపివేయడంతో పాటు రెండేళ్లుగా ప్రకటనల బకాయిలు చెల్లించకపోవడం ఆ సంస్థల మనుగడకు ఇబ్బందిగా మారిందన్నారు. రాష్ట్రంలో 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, కేబుల్ ఛానళ్లకు గతంలో ఉన్న కార్డుల్లో సగం తగ్గించిందని ఆరోపించారు. ఐపీ నెట్‌వర్క్ పేరుతో అనేక కేబుల్ ఛానళ్లకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలోనే జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేలా హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరు తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని సోమయ్య అన్నారు. ప్రస్తుతం అందిస్తు న్న పాత హెల్త్ కార్డులు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు.

నాగపూర్ లో ఘనంగా నూతన రథం జాతర





నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 6 (డీకే చాటింపు):కమ్మర్పల్లి మండలం నాగపూర్ లో శుక్ర వారం ఘనంగా నూతన రథం జాతర నిర్వహించారు. గ్రామం లో రామాలయం కొరకు రథం ను కొత్తగా తయారు చేయించారు.కమ్మర్పల్లి పూర వీధులలో భాజ భజం త్రీలతో ,మహిళల కొలాటాలతో ఊరే గింపుగా తీసు కొని దేవాలయంకు చేరు కున్నారు.గ్రామ అభి వృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో,దాతల సహ కారంతో 6.55 లక్షల వ్యయంతో రథం ఏర్పాటు చేశామని అధ్యక్షుడు తిరు పతి,కోశాధికారి శ్రీనివాస్ గౌడ్ లు తెలిపారు.రథోత్సవం లో గ్రామ సర్పంచ్ అశోక్, విలేజ్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు శ్రీను, బాబురావు, రాజేష్,గోవర్ధన్, విట్టల్, హరీష్,గంగాధర్,అభి,సాగర్,మహిళా మండలి సభ్యులు మాధవి,భాగ్య,గ్రామ మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొన్నారు.మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

కీడాకారుల వసతి సౌకర్యాల ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 6 (డీకే చాటింపు): తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు వేడుకల నేపథ్యంలో నిజామా బాద్‌కు విచ్చేయనున్న వివిధ జిల్లాలు, యూనిట్లకు చెందిన పోలీస్ క్రీడాకారులకు అవసరమైన వసతి సౌకర్యాల ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ సాయి చైతన్య,శుక్రవారం పర్యవేక్షించారు. జానకంపేటలోని పోలీస్ ట్రైనింగ్ సెంట ర్‌ను సందర్శించి, క్రీడా కారుల బస కోసం చేపడుతున్న ఏర్పాట్ల ను నేడు ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. క్రీడాకారు లకు ఎలాంటి అసౌక ర్యాలు కలగకుండా వసతి గదులు , తాగు నీరు , పారిశుద్ధ్యం , విద్యుత్ , మరుగు దొడ్లు తదితర మౌలిక సదుపాయాలను సమ కూర్చాలని సంబంధిత అధికారులకు సూచిం చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఆతిథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని , ప్రతి విభాగానికి ప్రత్యేక బాధ్యతలు కేటాయించి సమన్వయంతో పనిచే యాలని అధికారులను ఆదేశించారు.5వ తెలం గాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026ను విజయవంతంగా నిర్వ హించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సమగ్ర ఏర్పాట్లు చేస్తోం దని పోలీస్ కమిషనర్ తెలిపారు. బోధన్ ఏసిపి శ్రీనివాస్ , సి.టి.సి ఎ.సి.పి రాజ శేఖర్ ,బోధన్ రూరల్ సీఐ విజయబాబు , రుద్రూర్ సీఐ కృష్ణ , బోధన్ ఎస్హెచ్ఓ వెంకట్ నారాయణ , ఏడపల్లి ఎస్సై రమ తదితరులు కమిషనర్ తో ఉన్నారు.

పిసీసీ చీఫ్‌కు కృతజ్ఞతలు



(డీకే చాటింపు,నార్సింగ్): మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను పలువురు మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మున్నూరు కాపు సామాజిక వర్గం ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ రావు, గాలి అనిల్ కుమార్, కొలగాని మహేష్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల భవనాలపై రేవంత్ సర్కార్ పెత్తనం

జీవో 14 ప్రతులను చించేసిన ఎమ్మెల్సీ దాసోజు



(డీకే చాటింపు,హైదరాబాద్): శతాబ్దాలుగా అణచివేతకు గురై, అవమానాలుఅ ఎదుర్కొని, సమాజంలో బానిసలుగా పడి ఉన్న బహుజన సమాజానికి కేసీఆర్ వేల కోట్ల విలువైన భూములు,9,500 కోట్ల నిధులు కేటాయించి భవనాలు నిర్మించగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిపై పెత్తనం చెలాయిస్తూ కుల సంఘాలను 'కాపలాదారులు'గా మార్చాలని చూడడం అత్యంత హేయమైన చర్య అని బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత శ మధుసూదనాచారి, మాజీ మంత్రివర్యులు గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నేత వివేకానంద్ లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డా. దాసోజు శ్రవణ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 14పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుజనుల హక్కులను కాలరాసేలా ఉన్న ఆ జీవో ప్రతులను పత్రికాముఖంగా చించివేస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

ఢిల్లీ లో కేంద్ర పార్టీ ఇంచార్జ్ ,బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను కలసిన బిజెపి రాష్ట్ర నాయకులు కొలను శంకర్ రెడ్డి



హైదరాబాద్, (డీకే చాటింపు):ఢిల్లీలో కేంద్ర పార్టీ ఇంచార్జ్ ,బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ ఎంపీని అలాగే హర్యానా రాష్ట్రం కర్నాల్ లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ భట్ల ఎంపీ ని మర్యాద పూర్వకం గా కలిసి పూల మొక్కను అందచేసిన కోలన్ శంకర్ రెడ్డి బిజెపి తెలంగాణ రాష్ట్ర సీనియర్ నేత ఆ తర్వాత దీపావళి శుభాకాంక్షలు తెలపడం జరిగినది ,తరుణ్ చుగ్ మరియు సంజయ్ భట్ల మాట్లాడుతూ సమాజంలో కాంగ్రెస్ దాని కూటమి అరాచకాలను దేశ వ్యతిరేక చర్యలను బీజేపీ పై తప్పుడు ప్రచారాలను ప్రజలకు వివరించాలని అన్నారు, సర్ పై తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు సమన్వయంతో బీజేపీ శ్రేణులు ప్రజలకు దగ్గర కావాలన్నారు

కళాకారుల మండల అధ్యక్షున్ని సన్మానించిన జిల్లా కళాకారుల



చిగురుమామిడి (డీకే చాటింపు)చిగురుమామిడి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ చిట్టిమల్ల రవీందర్ ను మరియు కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ను సొసైటీ డైరెక్టర్ గా నియామకమైన సందర్భాన తెలంగాణ రంగస్థల సంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వంగ సుధాకర్ ప్రధాన కార్యదర్శి అలివేలి సమ్మిరెడ్డి గార్ల చేతుల మీదుగా శాలువాతో సత్కరించి సన్మానం చేయడం జరిగింది వంగ సుధాకర్ మాట్లాడుతూ రాజ్ కుమార్ ఇంకా మరెన్నో పదవులు పొందాలని కళాకారులకు మంచి పేరును తేవాలని ఆశిస్తూ అభినందనలు తెలియజేశారుఈ కార్యక్రమంలో చిగురుమామిడి గ్రామ సర్పంచ్ అకవరం భవాని శివప్రసాద్ చిగురుమామిడి కళాకారుల మండల ప్రధాన కార్యదర్శి రాధరపు సంపత్ సహాయ కార్యదర్శి కుతాడి కొమురయ్య , రమేష్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల అమలు ఆలస్యం చేస్తే వినూత్న పోరాటాలకి సిద్ధం



క్యాతన్ పల్లి(డీకే చాటింపు): సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రామకృష్ణాపూర్ సిహెచ్ పి లోని కార్మికులతో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు డిప్యూటీ జనరల్ సెక్రటరీ రాజేందర్ మరియు బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకట స్వామి మాట్లాడుతూ... సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చకపోతే కార్మికులందరినీ ఏకం చేస్తూ మరో తరహా వినూత్న పోరాటానికి సిద్ధం చేస్తామన్నారు. లాభాల వాటా ప్రకటన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రస్తావించిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ లో ఇవ్వాల్సిన యాక్టింగ్ ప్రమోషన్స్ ఇప్పటివరకు ఇవ్వకపోయినా గుర్తింపు ఉందన్న సంఘం స్పందించకపోవడం విడ్డూరమన్నారు. గత ఆర్థిక సం. సీఎంపిఎఫ్ నిల్వను ఎందుకు చూపెట్టడం లేదో యాజమాన్యం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణికి ఆర్థికంగా నష్టం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తమ డివిడెంట్ తీసుకొని చూస్తూ ఊరుకోవడం సరైన విధానం కాదని దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందంపై తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ స్పందించకపోవడం సరైనది కాదన్నారు. సంస్థ ఆర్థిక నష్టం కలిగిస్తూ కార్మికులకు రావాల్సిన రక్షణ పరికరాలను సప్లై చేయలేని స్థితికి తీసుకువచ్చిన రాజకీయ జోక్యాన్ని కార్మికులు గమనించాలని కార్మికులను కోరారు. కెసిఆర్ ప్రభుత్వం తరహాలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా సింగరేణి ఆర్థిక లోటి చేస్తే రానున్న ఎన్నికల్లో తప్పకుండా ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని ఇప్పటికైనా సంస్థలో ఆర్థిక దోపిడిని నివారించి రావాల్సిన బకాయిలను ఇవ్వాలన్నారు. ఇటీవల పెన్షన్ పై మరియు బోనస్ పై ఏఐటియుసి నాయకులు చేస్తున్న ఆరోపణలను కార్మికులు నమ్మరని, పెన్షన్ బోర్డు లోటు భర్తీకి కోసం సీఐటీయూ చేసిన ప్రతిపాదనలతోనే కొంచెం నిలదొక్కుకోగలిగిందని ఆ విషయం మీ పెన్షన్ బోర్డు సభ్యులను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్మికులలో యూనియన్ చేస్తున్న నిస్వార్థ పోరాటాలకు పెరుగుతున్న ఆదరణ తట్టుకోలేక సిఐటియును విమర్శిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు లింగాల సత్యనారాయణ, సెక్రటరీ గుజ్జ సతీష్, పిట్ ఇంచార్జ్ అయిందాల.శ్రీనివాస్, అంజన్న, మరియు కార్మికులు ఉన్నారు.

రూ.60,000 సిఎం ఫండ్ చెక్ ఇప్పించిన చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి



ఎల్బీనగర్, (డీకే చాటింపు) చైతన్యపురి డివిజన్ లోని దుర్గానగర్ నివాసి పిటి శ్రీనివాస్ కి గౌరవ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సహకారంతో 60000(అరవై వేల రూపాయలు)సిఎం ఫండ్ చెక్ ఇప్పించిన చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

అల్లం చాయ్.. మసాలా చాయ్.. గ్రీన్ టీ.. లెమన్ టీ.. ఇప్పుడు వాటి సరసన ఇప్ప పువ్వు చాయ్

-ఇప్ప పువ్వు టీకి మంత్రి సీతక్కే బ్రాండ్ అంబాసిడర్-మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇప్ప పువ్వు టీ స్టాల్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క





ములుగు జిల్లా,డీకే చాటింపు(నవంబర్ 6): అల్లం చాయ్, మసాలా చాయ్, గ్రీన్ టీ, లెమన్ టీ.. ఇలా ఎన్నో రకాల చాయ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండగా.. ఇప్పుడు వాటి సరసన ఇప్ప పువ్వు చాయ్ కూడా చేరింది. ఇప్పటికే ఇప్ప పువ్వుతో తయారు చేస్తున్న లడ్డూలు ప్రత్యేక గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో, ఇప్ప పువ్వు టీకి కూడా విస్తృత ప్రచారం కల్పించేందుకు మంత్రి సీతక్క స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామం వద్ద మహిళా స్వయం సహాయక సంఘాల చే ఇప్ప పువ్వు టీ స్టాల్‌ను మంత్రి ఏర్పాటు చేయించి ప్రారంభించారు. అడవుల్లో సహజంగా లభించే ఇప్ప పువ్వు ఆదివాసి గిరిజనుల జీవన విధానంలో భాగమని, తరతరాలుగా వారు ఇప్ప పువ్వును వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అటవీ ఉత్పత్తులను కేవలం సేకరించి విక్రయించడానికే పరిమితం కాకుండా, వాటికి అదనపు విలువ జోడించి మార్కెట్‌లో విక్రయించగలిగితే మహిళలకు మెరుగైన ఆదాయం లభిస్తుందని అన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాలు స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులతో వినూత్న ఉత్పత్తులను తయారు చేసి వ్యాపారవేత్తలుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ఇప్ప పువ్వు టీకి ప్రజల్లో ఆదరణ పెరిగేలా తానే ప్రచారం చేస్తానని, మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ములుగు ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఇప్ప పువ్వు టీని ప్రత్యేక ఆకర్షణగా పరిచయం చేయడంతో పాటు, ఈ ఉత్పత్తిని మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అటవీ సంపదకు విలువను జోడించి ఆదివాసి గిరిజన మహిళల చేతుల్లో ఆర్థిక సంపదగా మార్చడమే లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు.

లక్ష్మీదేవి కుబేర పూజలో పాల్గొన్న చైతన్యపురి మాజీ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా రంగా వీణా

ఎల్బీనగర్, (డీకే చాటింపు) వాసవి కాలనీ లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి అష్టలక్ష్మి మహిళ మండలి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి కుబేర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి మాజీ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా రంగా వీణా కుటుంబ సభ్యులు పాల్గొని లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు



నిబంధనలు మేము అనుసరించాము

న్యూయార్క్: అమెరికన్ ఉద్యోగుల స్థానంలో హెచ్-1బీ వీసాదారులను నియమించుకుంటోందన్న ఆరోపణలతో, మైక్రోసాఫ్ట్ సంస్థను 'పెర్మ్' (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్-ఖఇఖీఓ) గ్రీన్ కార్డ్ ప్రక్రియ నుంచి ట్రంప్ ప్రభుత్వం తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. మైక్రోసాఫ్ట్ ఈ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తోందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అయితే, ఈ ఆరోపణలను మైక్రోసాఫ్ట్ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. తాము ఎటువంటి నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేసింది.ఈ వివాదంపై మైక్రోసాఫ్ట్ స్పందిస్తూ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో తాము దాఖలు చేసిన సుమారు 6,000 హెచ్-1బీ దరఖాస్తుల్లో దాదాపు 80 శాతం దరఖాస్తులు, ఇప్పటికే సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల వీసా పొడిగింపు లేదా వారి హోదా (స్టేటస్) మార్పునకు సంబంధించినవేనని వివరించింది. ఇవి కొత్త నియామకాలు కావని స్పష్టం చేసింది. మిగిలిన దరఖాస్తులు సైతం అమెరికాలో ఇప్పటికే చట్టబద్ధంగా నివసిస్తూ తమ సంస్థలో చేరిన వారికి సంబంధించినవని, వీరు తమ మొత్తం అమెరికా సిబ్బందిలో కేవలం ఒక శాతం మాత్రమేనని పేర్కొంది. హెచ్-1బీ ఉద్యోగులకు సైతం సమాన పనికి సమాన వేతనం అందిస్తున్నామని, టెక్ రంగంలోనే అత్యధిక వేతనాలు చెల్లిస్తున్న సంస్థల్లో తమది ఒకటని ఈ సందర్భంగా వెల్లడించింది.గత ఏడాది మైక్రోసాఫ్ట్ సుమారు 6,000 మంది ఉద్యోగులను తొలగించిందని, అదే సమయంలో దాదాపు 6,300 హెచ్-1బీ వీసాలు, 3,000 గ్రీన్ కార్డులకు అనుమతులు పొందిందని జేడీ వాన్స్ ఆరోపించారు.

ఈ పరిణామాల నేపథ్యంలోనే అమెరికా కార్మిక శాఖ మైక్రోసాఫ్ట్‌పై చర్యలు తీసుకుంది.మైక్రోసాఫ్ట్‌తో పాటు అడోబ్ సహా మరికొన్ని ప్రధాన ఐటీ సంస్థలను కూడా పెర్మ్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేశారు. ఈ జాబితాలో కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమినీ వంటి భారత ఐటీ దిగ్గజాలు కూడా ఉండటం గమనార్హం. ఈ సస్పెన్షన్ కారణంగా సదరు కంపెనీలు ప్రస్తుతానికి కొత్తగా పెర్మ్ దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉండదు. అయితే, కొత్త హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసుకోవడంపై గానీ, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల హోదాపై గానీ ఈ నిర్ణయం ఎటువంటి ప్రభావం చూపదు.మరోవైపు, ఈ తాజా పరిణామాలు అమెరికాలో ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డుల కోసం వేచిచూస్తున్న భారతీయ ఐటీ నిపుణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.


నవీ పిళ్లైకు నోబెల్ శాంతి



న్యూఢిల్లీ: అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లేను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది.దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్లే జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఎఅఅ) న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ఎఅఏ)లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు.రువాం డా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్లే పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది.ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది. నవీ పిళ్లే వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది.ల్లోడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా దేశాల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడింది.

హుస్సేన్ సాగర్ టూ ప్రకాశం బ్యారేజ్ సీప్లేన్

హైదరాబాద్, : హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నీటిపై విమానం వేగంగా దూసుకెళ్లి ఆకాశంలోకి ఎగరడం, క్షణాల్లో కృష్ణా తీరానికి చేరుకుని విజయవాడ ప్రకాశం బ్యారేజీ జలాల్లో ల్యాండ్ అవ్వడం.. వినడానికే ఎంతో అద్భుతంగా అనిపించే ఈ ఊహ త్వరలోనే నిజరూపం దాల్చేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్-విజయవాడ నగరాల మధ్య నిత్యం వేలాది మంది ప్రయాణికులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శంషాబాద్-గన్నవరం విమాన సర్వీసులపై ఆధారపడుతున్నారు. అయితే, సాధారణ రవాణా వ్యవస్థకు పూర్తి భిన్నంగా, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే అత్యాధునిక సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ సర్వీసులు ప్రారంభమైతే ప్రయాణ సమయం అదా కావడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల పర్యాటక రంగానికి ఊహించని సరికొత్త ఊపు లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సాహసోపేత, జల పర్యాటకాన్ని ఇష్టపడే దేశ, విదేశీ పర్యాటకులకు ఇదొక అద్భుతమైన అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తూ, నూతన పర్యాటక పాలసీని రూపొందించి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో దిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రితో భేటీ అయినప్పుడు హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీల మధ్య సీప్లేన్ సేవల నిర్వహణ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే ప్రక్రియ ఊపందుకుంది.దీనిలో భాగంగా భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ)కి చెందిన ఉన్నతాధికారుల ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టింది. రాష్ట్ర పర్యాటకశాఖ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఉన్నతాధికారులతో కలిసి ఏఏఐ ప్రతినిధులు హుస్సేన్‌సాగర్‌లోని వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. జల విమానాలు సురక్షితంగా నీటిపై దిగేందుకు (ల్యాండింగ్), పైకి ఎగిరేందుకు (టేకాఫ్) అవసరమైన నీటి లోతు, ఉపరితల వైశాల్యం, ప్రవాహ వేగం వంటి సాంకేతిక అంశాలను లోతుగా లెక్కించారు. దీంతోపాటు విమానం నీటిపై ప్రయాణించే మార్గం (ట్యాక్సీ పార్క్), ప్రయాణికులు ఎక్కేందుకు మరియు దిగేందుకు వీలుగా జెట్టీలు, ప్యాసింజర్ టెర్మినల్ సదుపాయాలు ఎక్కడ ఏర్పాటు చేయవచ్చనే అంశాలపై సమగ్ర పరిశీలన జరిపారు.హుస్సేన్‌సాగర్‌లో చేపట్టిన క్షేత్రస్థాయి తనిఖీలకు సంబంధించిన అన్ని సాంకేతిక, పర్యావరణ వివరాలతో ఏఏఐ నిపుణుల బృందం త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను (డీపీఆర్ రూపంలో) సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపు, ఏజెన్సీల ఎంపికపై కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.



పనితీరుపై రేవంత్ నజర్



హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిమూడేళ్లు పూర్తవుతున్న తరుణంలో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆత్మపరిశీలనకు సిద్ధమైంది. ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా నేతల పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అత్యంత రహస్యంగా పావులు కదుపుతోంది. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ సహా పలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇంటెలిజెన్స్ ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రజా నాడిని ముందుగానే పట్టుకుని, లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది.సాధారణంగా ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక తమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి.. తమ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. అనే అంశాలపై ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీల ద్వారా నిఘా పెడుతుంటాయి. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఏకంగా ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో లోతుగా ఆరా తీస్తోంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా ఈ సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ సర్వేలో కేవలం ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరు మాత్రమే కాకుండా, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, మంత్రుల పాలనా శైలిపై కూడా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వథకాల అమలు తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఏ ఏ పథకాలపై సానుకూలంగా ఉన్నారు? వేటిపైన అసంతృప్తితో ఉన్నారు.. లాంటి అంశాలను గుర్తించి.. సరిదిద్దుకేవడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.గత ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ సర్వేలో ప్రజలను ప్రధానంగా అయిదు నుంచి ఏడు రకాల కీలక అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేల పనితీరుతో పాటు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే బాగుంటుంది? ఒకవేళ కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే దానికి గల కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలను సంధించడం ద్వారా ప్రతిపక్షాల వైపు ప్రజల మొగ్గు ఎలా ఉందో అంచనా వేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా హైడ్రా పనితీరు, ఉచిత పథకాలు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు వంటి సమస్యాత్మక అంశాలపై ప్రజల స్పందనను ఇంటెలిజెన్స్ వర్గాలు కూలంకషంగా సేకరిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు ఎంతవరకు జనాల్లోకి వెళ్లాయనే కోణంలోనూ ఈ సర్వే వివరాలు రాబడుతోంది. అదే సమయంలో, కొన్ని వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకత, ఉచితాలకు వ్యతిరేకంగా ఉన్న అభిప్రాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఈ డేటా ప్రభుత్వానికి అత్యంత కీలకం కానుంది. ఎన్నికల సమయానికి ముందే ప్రజా వ్యతిరేకతను తగ్గించి, పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఇంటెలిజెన్స్ సర్వేను ఒక అస్త్రంగా మలుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

కాంగ్రెస్ వ్యూహాలకు ఎదురుదెబ్బలు!



హైదరాబాద్, : తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఆ పార్టీ దూకుడును అడ్డుకునేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులు కోర్టుల్లో నిలవట్లేదు. బలమైన సెక్షన్లు నమోదు చేయకపోవడంతో కేసులు కోర్టుల్లో వీగిపోతున్నాయి. ఇది అధికార పార్టీ వర్గాల్లో తీవ్ర కలవరం రేపుతోంది. రాజకీయ ప్రత్యర్థుల దూకుడుకు కళ్లెం వేయాలని భావిస్తున్న కాంగ్రెస్ వ్యూహాలు అడుగుడుగునా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తమను అప్పటి ప్రభుత్వం ఎలా వేధించిందో, ఎన్నిసార్లు జైలుకు పంపిందో కాంగ్రెస్ నేతలు పదే పదే గుర్తుచేసుకుంటున్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్థాయిలో ప్రతిపక్ష నేతలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని భావించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిని, ఇతర ప్రముఖ నాయకులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై అధికార పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు.అయితే.. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల్లో గట్టి సెక్షన్లు ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రపు సెక్షన్ల కారణంగా నిందితులు సులభంగా కోర్టుల నుంచి ఊరట పొందుతున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ దక్కకపోగా, కొద్ది గంటల్లోనే బెయిల్ పై బయటకు వస్తున్నారు. ఇది కాంగ్రెస్ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కఠినమైన పోలీసు చర్యలను ఎదుర్కొన్నామని.. కానీ ఇప్పుడు ప్రతిపక్షాలపై అలా ఎందుకు వ్యవహరించలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ భవిష్యత్తులో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటనే అభద్రతాభావం కొందరు నేతల్లో కనిపిస్తోంది.పోలీస్ యంత్రాంగం నరైన లీగల్ సెక్షన్లను ప్రయోగించడంలో విఫలమవుతోందని, దీనివల్ల అధికార పార్టీ పరువు పోవడంతో పాటు ప్రత్యర్థులకు రాజకీయ మైలేజీ దక్కుతోందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ, తగిన ఆధారాలతో కూడిన పటిష్టమైన ఎఫ్ఐఆర్‌లు నమోదు కాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని వాపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో కీలక చర్చ జరుగుతోంది. ఎంతమందిపై కేసులు పెట్టామనేదాని కంటే, పెట్టిన కేసులు ఎంత బలంగా ఉన్నాయనే దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. సోషల్ మీడియా పోస్టులు లేదా వ్యక్తిగత విమర్శల విషయంలో ప్రత్యర్థులను న్యాయపరంగా గట్టిగా నిలువరించాలంటే మరింత లోతైన లీగల్ రీసెర్చ్, పకడ్బందీ చట్టపరమైన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.ఎదుటివారి దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో ప్రస్తుత వ్యూహాత్మక లోపాలను సరిదిద్దకపోతే, అది రాబోయే కాలంలో పార్టీకి మరింత నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. ఏది ఏమైనప్పటికీ, చట్టపరమైన చిక్కులను అధిగమించి బీఆర్ఎస్ దూకుడును కట్టడి చేయడం కాంగ్రెస్ సర్కార్‌కు ప్రస్తుతం పెద్ద సవాల్‌గా మారింది.

6 వేల కి.మీ.కుపైగా అండర్‌గ్రౌండ్ కేబులింగ్

హైదరాబాద్, : హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను మరింత ఆధునికంగా, సురక్షితంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రాజెక్ట్ చేపట్టింది. ఱఊఖఆఅఒ ఆధ్వర్యంలో హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 అమలు కానుంది. ఇందులో సుమారు 311 కిలోమీటర్ల 33 కేవీ, 5,772 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భంలోకి మార్చనున్నారు. చెట్లు, గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతోపాటు వీధుల్లో భద్రత, నగర సౌందర్యం, స్మార్ట్ గ్రిడ్ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని ఱఊఖఆఅఒ అధికారులు ట్విట్టర్ ఎక్స్ ద్వారా వెల్లడించారు.ప్రపంచ స్థాయి నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరంలో ప్రస్తుతం స్తంభాలపై ఉన్న విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చే హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1ను చేపడుతోంది. తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుండగా.. నగర విద్యుత్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది.ఫేజ్-1లో సుమారు 311 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను, దాదాపు 5,772 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లను భూగర్భంలోకి తరలించనున్నారు. బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్, సైఫాబాద్, బోయిన్‌పల్లి, అస్మాన్‌గఢ్, ఆజామాబాద్ డివిజన్లు ఈ తొలి దశలో భాగంగా ఉన్నాయి. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలోని 11 డివిజన్లలో ఈ పనులు చేపట్టనున్నారు. భూగర్భ కేబులింగ్‌తో ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎదురయ్యే అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం చెట్లు విరిగిపడటం, బలమైన గాలులు, వర్షాలు, పిడుగుల ప్రభావంతో విద్యుత్ లైన్లు దెబ్బతినే సందర్భాలు ఉంటాయి. కేబుళ్లు భూగర్భంలోకి వెళ్లడంతో ఇలాంటి బాహ్య ప్రభావాల నుంచి విద్యుత్ వ్యవస్థకు రక్షణ లభిస్తుంది.

54 మందికి ఒకే ఇల్లు అమ్మకం భాగ్యనగరంలో బడా మోసగాళ్లు



హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోచోట ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ బి.నుమతి హెచ్చరించారు.మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషాద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది. దాన్ని వివిధ వ్యక్తులకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బ్రోకర్ల ద్వారా ప్రచారం చేయడంతోపాటు, నమ్మకం కలిగించేందుకు పెంట్‌హౌస్‌లో ఉంటున్న అస్మాబేగంను కిరాయిదారుగా చూపించారు. కొందరికి కొంతకాలం అద్దె కూడా చెల్లించారు. 2021 మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 54 మంది నుంచి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. రూ.15 లక్షలు నష్టపోయిన నయీం బాను ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అస్మాబేగంను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.మరో కేసులో డాక్యుమెంట్ రైటర్ దేవగుప్తపు వీర వెంకట సత్యనారాయణ, అతని మాజీ డ్రైవర్ పోలె రాజుతో కలిసి సుమారు ఎనిమిదేళ్లుగా నకిలీ ఆస్తి పత్రాల దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. జీపీఏ, ఎస్‌పీఏ, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టేజ్ రిలీజ్ వంటి పత్రాలతోపాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల సంతకాలు, నకిలీ స్టాంపులు ఉపయోగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లోని విలువైన స్థలాలకు సంబంధించిన నకిలీ పత్రాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని ఓ ఫ్లాట్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు 25 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, 41 నకిలీ రబ్బరు స్టాంపులు, పలు ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణలోకి అకున్ సబర్వాల్

హైదరాబాద్, : సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ తిరిగి తెలంగాణ క్యాడర్‌లోకి రానున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర పోలీసు, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కేంద్ర డిప్యుటేషన్ పూర్తి చేసుకున్న ఆయనకు త్వరలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో.. గతంలో ఆయన చేపట్టిన సంచలనాత్మక టాలీవుడ్ డ్రగ్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. 2017లో హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ రాకెట్ దర్యాప్తులో అప్పటి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న అకున్ సబర్వాల్ కీలక పాత్ర పోషించారు. ఆయన నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం పలువురు సినీ ప్రముఖులను విచారించింది.అప్పట్లో ఎల్ఎస్‌డీ,ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల సరఫరా వ్యవహారం హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. డ్రగ్ పెడ్లర్ల అరెస్టుల అనంతరం వారి కాంటాక్ట్ లిస్టుల్లో సినీ ప్రముఖుల ఫోన్ నంబర్లు ఉన్నాయన్న అంశం ఆధారంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారించారు. అయితే కేవలం ఫోన్ నంబర్లు ఉండటం, పరిచయం ఉండటం మాత్రమే నేరానికి ఆధారం కాదని దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయి. అప్పట్లో సినీ పరిశ్రమను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్న విమర్శలను సబర్వాల్ కూడా ఖండించారు.తదుపరి దశలో ఈ కేసుల దర్యాప్తు తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయి. 2024లో ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరు కేసులను తగిన ఆధారాలు లేవన్న కారణంతో కోర్టు కొట్టివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. దర్యాప్తులో అనుసరించాల్సిన విధానాలు పాటించలేదని, కొన్ని కేసుల్లో సరైన సాక్ష్యాలు లేవని కోర్టు పేర్కొన్నాయి.ఇక అంతకు ముందే అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన తిరిగి తెలంగాణకు రావడం సహజంగానే పాత కేసుపై ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన రాకతో డ్రగ్స్ కేసును ప్రభుత్వం తిరిగి తెరుస్తుందనే ప్రచారం జరుగుతోంది. దాంతో పాటు ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇస్తారన్నది



కూడా చర్చనీయాంశంగా మారింది. రేవంత్ సర్కార్ డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతుండగా.. తిరిగి అదే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది.ఒకవేళ ఆయనకు ఆ బాధ్యతలనే అప్పగిస్తే.. అప్పటి దర్యాప్తులో నమోదైన అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి సమీక్షిస్తుందా ? దర్యాప్తులో ప్రస్తావనకు వచ్చిన పేర్లపై మరింత లోతైన విచారణకు అవకాశం ఉంటుందా ? అప్పట్లో రాజకీయ, సినీ వర్గాల్లో చర్చకు వచ్చిన ఇతర పేర్లు ఏమైనా అధికారిక దర్యాప్తు రికార్డుల్లో ఉన్నాయా ? ఉంటే వాటి వివరాలు ప్రజలకు వెల్లడవుతాయా ? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా అకున్ సబర్వాల్ రీఎంట్రీతో పాత డ్రగ్స్ కేసు రాజకీయ రంగు పులుముకుంటుందా, లేక ఇది కేవలం ఒక సీనియర్ అధికారి క్యాడర్ రిటర్న్‌గానే మిగిలిపోతుందా అన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. ఆయనకు లభించే పోస్టింగ్, ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చే అవకాశం ఉంది.ఇక అకున్ సబర్వాల్ సతీమణి సీనియర్ ఐపీఎస్ స్మితా సబర్వాల్ వ్యక్తిగత కారణాలతో లాంగ్ లీవ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

మలుపులు తిరుగుతున్న రాజకీయం రేవంత్ టార్గెట్ గా కేటీఆర్ 'ఓపెన్ లెటర్స్'



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయం ప్రతిరోజూ కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా నిర్ణయాలు, వివాదాస్పద వ్యాఖ్యలు, బిఆర్ఎస్ శ్రేణులపై జరుగుతున్న పోలీసు కేసుల విచారణల సందర్భంలో.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖలు రాయడం , ఎక్స్ వేదికగా నేరుగా ట్యాగ్ చేస్తూ రేవంత్‌ను అదుపులో పెట్టుకోండి అని డిమాండ్ చేయడం చర్చనీయాంశమవుతోంది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యర్థి పార్టీ నాయకుడు ఫిర్యాదు చేస్తే రాహుల్ గాంధీ చర్యలు తీసుకుంటారా అంటే.. అసలు అటువంటి అవకాశమే లేదనేది అందరికీ తెలిసిన సత్యం. మరి లాజిక్‌కు అందని ఈ ఫిర్యాదుల వ్యూహం వెనుక కేటీఆర్ , బిఆర్ఎస్ ఆశిస్తున్న అసలు రాజకీయం ఏమిటి?కేటీఆర్ లక్ష్యం రాహుల్ గాంధీ ద్వారా రేవంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చేయడం కాదు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రచారం చేసే భారత రాజ్యాంగ పరిరక్షణ , ప్రజాస్వామ్య విలువలు , వ్యక్తి స్వేచ్ఛ అనే సిద్ధాంతాలలోని నైతిక వైరుధ్యాన్ని జాతీయ స్థాయిలో ఎండగట్టడమే బిఆర్ఎస్ ప్రధాన వ్యూహం. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ సోషల్ మీడియా నేతలను అరెస్ట్ చేస్తుంటే , విపక్షాల ప్రతినిధులపై కేసులు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్నను కేటీఆర్ సమాజం ముందుకు తెస్తున్నారు.ఈ వ్యూహంలో ఉన్న మరో కీలకమైన అంశం.. నైతిక బాధ్యత ను అధిష్ఠానం భుజాన పెట్టడం. రేవంత్ రెడ్డి చేసే వ్యాఖ్యలు , నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ అధికారిక విధానమా కాదా అని ప్రశ్నించడం ద్వారా, రేవంత్ చర్యలకు రాహుల్ గాంధీ కూడా నైతిక బాధ్యత వహించక తప్పని పరిస్థితిని బిఆర్ఎస్ కల్పిస్తోంది. రాహుల్ గాంధీ ఈ ఫిర్యాదులపై స్పందించకపోయినా లేదా మౌనంగా ఉన్నా.. అది రేవంత్ నిర్ణయాలకు రాహుల్ మద్దతు ఉందనే సంకేతం అని, కాంగ్రెస్ మార్క్ సిద్ధాంతాలు కేవలం ప్రచారానికేనని నెటిజన్లలో ప్రచారం చేయడానికి బిఆర్ఎస్‌కు ఒక బలమైన లీడ్ లభిస్తోంది. దీనికితోడు, తెలంగాణ రాజకీయాలను కేవలం హైదరాబాద్ బోర్డర్లకే పరిమితం చేయకుండా జాతీయ మీడియా , ఢిల్లీ రాజకీయ వర్గాల్లోకి తీసుకెళ్లడానికి ఈ 'ఓపెన్ లెటర్స్' వ్యూహం తోడ్పడుతోంది. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నేరుగా ట్యాగ్ చేస్తూ లేఖలు రాసినప్పుడు లేదా విమర్శలు చేసినప్పుడు నేషనల్ మీడియా కూడా దీనిపై దృష్టి సారిస్తోంది. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చే విమర్శలు, ఆరోపణలు జాతీయ స్థాయిలో హైలైట్ అయ్యి కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఏర్పడుతోంది.అలాగే, కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, సీనియర్ నేతల అసంతృప్తిపై మానసిక ఒత్తిడి పెంచడం కూడా ఇందులో దాగి ఉన్న మరో ప్లాన్. సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై ఢిల్లీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లడం వల్ల, కాంగ్రెస్‌లోని రేవంత్ వ్యతిరేక వర్గానికి లేదా పాతకాపులకు ఒక రకమైన రాజకీయ మద్దతు లభిస్తుందని, అది కాంగ్రెస్ అంతర్గత విభేదాలను మరింత ఉద్రేకపరుస్తుందని బిఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు, ఈ ఫిర్యాదులపై కాంగ్రెస్ శ్రేణులు , సీఎం రేవంత్ రెడ్డి చాలా తేలికగా స్పందిస్తున్నారు. ప్రత్యర్థి ఫిర్యాదులను చూసి ఏ హైకమాండ్ కూడా తమ ప్రజాదరణ ఉన్న ముఖ్యమంత్రిని తప్పు పట్టదని, కేటీఆర్ కేవలం సోషల్ మీడియా పబ్లిసిటీ మరియు కవరేజ్ కోసమే ఇటువంటి డ్రామాలు ఆడుతున్నారని కాంగ్రెస్ డిజిటల్ వింగ్ తిప్పికొడుతోంది. కేటీఆర్ రాహుల్ గాంధీకి చేసే ఫిర్యాదులు రేవంత్ రెడ్డి పదవిని ఊడగొట్టడానికి కాదని, రాహుల్ గాంధీ నైతికతను ప్రశ్నించడం ద్వారా జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లో పడేయడానికి వేస్తున్న ఒక తెలివైన పొలిటికల్, మీడియా గేమ్ అని బీఆర్ఎస్ నేతలంటున్నారు.

విజిల్ బ్లోయర్స్ సోషల్ మీడియా వింగ్



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు రోజురోజుకూ మరింత పదునెక్కుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా బిఆర్ఎస్ అధినేతలు కేటీఆర్, హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుని ల్యాండ్ కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్వహణపై చేస్తున్న ఆరోపణలు మీడియా, సోషల్ మీడియా వేదికల్లో ట్రెండింగ్‌గా మారుతుండగా.. దానికి పోటీగా రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆస్తులు, వ్యాపార లావాదేవీలపై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మాత్రం ప్రజా చర్చగా మారడంలో విఫలమవుతున్నాయి. ఒక వైపు సీఎం విమర్శలకు కేటీఆర్, హరీష్ రావు సుదీర్ఘ ప్రెస్ మీట్లు పెట్టి వివరణలు ఇస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం బీఆర్ఎస్ విమర్శలను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం ఆరోపణలు గుప్పించే నాయకత్వ స్థాయి, కమ్యూనికేషన్ వ్యూహంలో ఉన్న వ్యత్యాసమేనని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి స్వయంగా మైక్ ముందుకొచ్చి నేరుగా కేటీఆర్, హరీష్ రావుల పేర్లను ప్రస్తావిస్తూ దాడి చేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం సీఎం కుటుంబంపై చేసే ఆరోపణలను పార్టీ సోషల్ మీడియా ఇన్ఛార్జ్ మన్నె క్రిషాంక్ ద్వారా డిజిటల్ వేదికలపైకి వదులుతోంది. కేటీఆర్, హరీష్ రావు లాంటి అగ్రనేతలు నేరుగా ముందుండి ఈ ఆరోపణలకు బాధ్యత తీసుకోకపోవడం వల్ల, ఇవి కేవలం సోషల్ మీడియా ఇన్ఛార్జ్ చేసే వ్యక్తిగత కామెంట్లు, పాయింట్లు లేని డిజిటల్ డ్రామా గా మాత్రమే జనాల్లోకి వెళుతున్నాయి.మరోవైపు, బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారంలో విశ్వసనీయత, ఆధారాల కొరత స్పష్టంగా కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేవంత్ రెడ్డి కుటుంబ వ్యాపారాలు , ఆస్తులపై బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ విడుదల చేస్తున్న పోస్టులు, పేపర్ క్లిప్పింగులు క్షేత్రస్థాయి ఆధారాలతో కాకుండా ఆరోపణల స్థాయిలోనే ఉండిపోతున్నాయి. సరైన అధికారిక పత్రాలు లేకుండా ప్రతిరోజూ చేసే ఈ దాడి పట్ల సాధారణ ప్రజల్లో పొలిటికల్ సాచ్యురేషన్ పెరిగిపోవడంతో సోషల్ మీడియాలో కూడా వీటికి ఆశించిన స్పందన లభించడం లేదు.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ , సీఎం రేవంత్ రెడ్డి ఈ ఆరోపణలకు సైలెంట్‌గా ఉండటం కూడా ఒక పక్కా వ్యూహంలో భాగమేనని విశ్లేషిస్తున్నారు. ప్రతిపక్షం నుంచి వచ్చే ప్రతి చిన్న విమర్శకూ సీఎం స్థాయిలో సమాధానం ఇస్తే, ఆ ఆరోపణకు అనవసరంగా హైప్ ఇచ్చినట్లవుతుందనేది కాంగ్రెస్ డిజిటల్ ప్లానర్స్ ఆలోచన. ప్రతిపక్ష నాయకులే రక్షణ ధోరణిలోకి వెళ్లి సుదీర్ఘ వివరణలు ఇస్తుండటంతో, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సైలెంట్‌గా ఉంటూనే చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఆ వార్తలకు బ్రేక్ వేస్తోంది. బీఆర్ఎస్ చేస్తున్న మరొక ప్రధాన వ్యూహాత్మక తప్పిదం.. తమ పార్టీ అగ్రనాయకత్వం కాకుండా సోషల్ మీడియా వింగ్ నేతలను విజిల్ బ్లోయర్స్ గా ప్రొజెక్ట్ చేయడం! కేటీఆర్ లేదా హరీష్ రావు ప్రెస్ మీట్ పెట్టి ఆధారాలు బయటపెడితే వచ్చే పొలిటికల్ ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది. కానీ ఇన్ఛార్జ్‌ల ద్వారా ఆరోపణలు చేయించి, ప్రభుత్వం వారిపై కేసులు పెట్టగానే ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు అంటూ కేటీఆర్ ట్వీట్లు చేయడం వల్ల.. ప్రజలకు ఇది కేవలం ఒక లీగల్ ,డిజిటల్ ఫైట్ లాగానే కనిపిస్తోంది తప్ప, నిరూపించబడిన పెద్ద స్కామ్‌లాగా అనిపించడం లేదని అనుకుంటున్నారు. విమర్శలకు పొలిటికల్ ఇమేజ్, స్పష్టమైన ఆధారాలు తోడైనప్పుడే అవి ప్రజల్లో నానుతాయి. రేవంత్ రెడ్డి విసురుతున్న పొలిటికల్ పంచ్‌లకు ప్రత్యక్షంగా కౌంటర్ ఇస్తూ రక్షణలో పడిపోయిన బీఆర్ఎస్, సీఎం కుటుంబంపై చేసే ఆరోపణల్లో మాత్రం రెండో శ్రేణి నాయకత్వాన్ని వాడటం ద్వారా పెద్ద వ్యూహాత్మక తప్పిదమే చేసింది. ఈ డిజిటల్ వార్తల్లో మైండ్ గేమ్‌ను గెలవాలంటే బీఆర్ఎస్ తన దాడి వ్యూహాన్ని, నాయకత్వ బాధ్యతను పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భారతీయులకు ట్రంప్ మరో షాక్...



హైదరాబాద్, : అమెరికాలో పనిచేస్తున్న విదేశీ టెక్ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మంజూరు ప్రక్రియలో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి ప్రపంచ ప్రఖ్యాత ఐటీ అవుట్‌సోర్సింగ్ దిగ్గజాలను సస్పెండ్ చేస్తూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారన్న ఆరోపణలతో ఈ కఠిన చర్యలు చేపట్టింది. జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు ప్రముఖ టెక్ సంస్థలు మైక్రోసాఫ్ట్, అడోబ్ కూడా ఉన్నాయని అమెరికా కార్మిక శాఖ స్పష్టం చేసింది. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ సమక్షంలో వైట్‌హౌస్ వేదికగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇకపై ఈ కంపెనీల నుంచి ఎలాంటి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించబోమని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను కూడా పూర్తిగా నిలిపివేస్తున్నామని వెల్లడించారు.పెర్మ్ ప్రక్రియ అంటే.. అమెరికాలో ఒక కంపెనీ విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డ్ ఇఒ-2, ఇఒ-3 కేటగిరీలు స్పాన్సర్ చేయాలంటే, మొదటగా కార్మిక శాఖ నుంచి ఈ లేబర్ సర్టిఫికేషన్ పొందడం తప్పనిసరి చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగం చేసేందుకు స్థానికంగా అర్హులైన అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని, విదేశీయుడిని తీసుకోవడం వల్ల అమెరికన్ వర్కర్ల వేతనాలపై ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించాల్సి ఉంటుంది. కార్మిక శాఖ ఈ సర్టిఫికేట్‌ను ఆమోదించిన తర్వాతే కంపెనీలు యూఎస్‌సీఐఎస్ వద్ద ఐ-140 పిటిషన్ దాఖలు చేయగలవు. ఇప్పుడు ఈ ప్రధాన మార్గాన్నే నిలిపివేయడంతో, ఈ కంపెనీలు తమ విదేశీ ఉద్యోగుల తరఫున కొత్తగా గ్రీన్ కార్డ్ ప్రక్రియను ప్రారంభించే అర్హతను తాత్కాలికంగా కోల్పోయినట్లయింది.అమెరికా అధికార యంత్రాంగం ఈ కఠిన చర్యకు దిగడానికి హెచ్-1బీ , పెర్మ్ నిబంధనల దుర్వినియోగమే ప్రధాన కారణమని స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఈ దిగ్గజ ఔట్‌సోర్సింగ్ సంస్థలు దాదాపు 30 లక్షల మంది విదేశీ నిపుణుల కోసం దరఖాస్తులు చేశాయని, 2.3 లక్షలకు పైగా హెచ్-1బీ అప్రూవల్స్, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు పొందాయని యూఎస్ కార్మిక శాఖ పేర్కొంది. అమెరికన్ వర్కర్లకు సమాన అవకాశాలు కల్పించకుండా స్థానిక ఉద్యోగాలను కొల్లగొట్టేలా లేబర్ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించారని, ఫెడరల్ దర్యాప్తులు ఎదుర్కొంటున్నందున ఈ సస్పెన్షన్ వేటు వేశామని వివరించింది. తాజా చర్యలు అమెరికన్ నిరుద్యోగుల హక్కులను కాపాడేందుకేనని ప్రభుత్వం సమర్థించుకుంది.ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ ఐటీ నిపుణులకు, గ్రీన్ కార్డ్ ఆశావహులకు తీరని ఎదురుదెబ్బగా పరిణమించనుంది. ఈ సంస్థల్లో పనిచేస్తూ ఇప్పటికే పెర్మ్ అనుమతుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయ టెక్కీల భవిష్యత్తు ఒక్కసారిగా అనిశ్చితిలో పడింది. కొత్తగా దరఖాస్తులు ఆగిపోవడంతో పాటు, పెండింగ్ ఫైల్స్ కూడా నిలిచిపోవడం వల్ల గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్ మరింత తీవ్ర జాప్యానికి గురవుతుంది. ఇది భారత ఐటీ కంపెనీల వ్యాపార కార్యకలాపాలు, ఆన్-సైట్ డిప్లాయ్‌మెంట్ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా అధికారులు ఈ కంపెనీల అంతర్గత విధానాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, సస్పెన్షన్‌ను ఎత్తివేసే వరకు ఈ సంస్థల్లోని ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మొదటి అడుగు పడటం అసాధ్యంగా మారనుంది.

ఓటర్ల నమోదుకు పెద్ద ఎత్తున అప్లికేషన్లు

హైదరాబాద్, : తెలంగాణలో ఎస్ఐఆర్ కీలక దశకు చేరుకుంది. యువ ఓటర్లు, కొత్తగా అర్హత పొందిన పౌరులతో పాటు విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి కూడా భారీగా దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు అడ్రస్ మార్పులు, పేర్లు, ఇతర వివరాల సవరణ కోసం పెద్ద సంఖ్యలో అభ్యర్థనలు నమోదయ్యాయి. ఓటర్ల పేర్ల తొలగింపుపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎన్నికల అధికారులు పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ జిల్లా నుంచి కొత్త ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ప్రత్యేకంగా గణనీయంగా ఉంది. అనంతరం నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్-6 దరఖాస్తులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ం దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి అంశాల కోసం 5,04,782 ఫామ్-8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్-7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి.ఫామ్-7 ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది.జిల్లాల వారీగా చూస్తే కొత్త ఓటు నమోదు కోసం అత్యధిక దరఖాస్తులు హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చినట్లు ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 29,226 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 మంది ఎన్ఆర్ఐలు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 ఫామ్-8 దరఖాస్తులు అందాయిఓటర్ల తొలగింపు అంశంలో హైదరాబాద్ జిల్లా కూడా చర్చనీయాంశంగా మారింది. ఫామ్-7ల దాఖలాపై హైదరాబాద్ నగరంలో రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇటీవల బల్క్‌గా సమర్పించిన ప్రీ-ఫిల్డ్ ఫామ్-7ల వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు.

2027 వర్షాకాలం నాటికి ఈ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులు



కరీంనగర్: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 వర్షాకాలం నాటికి ఈ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి కొత్త డిజైన్లను సమర్పిస్తామని, ఆ తరువాత సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే క్షేత్రస్థాయిలో బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణం నాణ్యత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను అత్యంత పటిష్ఠం చేస్తామని, ఈ మూడింటిలో నీటి నిల్వతో పాటు వినియోగ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి రైతులకు సాగునీరు నీరందిస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు (ఐఒఎఖ) భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గోదావరి నదిపై నిర్మించిన ఒక బహుళార్ధసాధక నీటిపారుదల ప్రాజెక్టు. ప్రపంచంలో అతిపెద్ద మల్టీ స్టేజ్ ఎత్తిపోతల ప్రాజెక్టు. 2016లో శంకుస్థాపన చేయగా, తొలి దశ 2019 జూన్ 21న అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్రాజెక్టు 13 జిల్లాల గుండా సుమారు 500 కి.మీ (310 మైళ్ళు) దూరం విస్తరించి ఉంది. ఈ ప్రాజెక్టు మొత్తం 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసి అందించడమే లక్ష్యం. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 195, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20, భూగర్భ జలాల నుంచి 25). ఇందులో 169 టీఎంసీలను రైతులకు సాగునీటి కోసం, 30 టీఎంసీలను హైదరాబాద్ నీటి అవసరాలకు, 16 టీఎంసీలను ఇతర పారిశ్రామిక అవసరాలకు, 10 టీఎంసీలను సమీప గ్రామాలకు తాగునీటి కోసం కేటాయించారు.నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే 3 ప్రధాన బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023లో మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగడంతో ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పగుళ్లకు రిపేర్లు చేపించాలని బీఆర్ఎస్ చెబుతంటే.. భారీ స్కామ్ చేసి దోచుకున్నారని కేసీఆర్ ఫ్యామిలీ మీద కాంగ్రెస్ నేతలు ఆరోపణలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టు లోపాలు, నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పించడం బీఆర్ఎస్ పార్టీకి మైనస్ అయింది. ప్రాజెక్టు సేఫ్టీ మీద అనుమానంతోనే గత మూడేళ్లుగా బ్యారేజీల నుంచి తెలంగాణ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడం లేదు. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతున్నాయని తెలిసిందే

ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

విజయవాడ : ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్ అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీల స్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంత సంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికి సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో విపరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ (కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిది ఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం.జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజిక వర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ-వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంత మేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లను చీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి.ఏపీలో కొత్త పార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధుల నిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్క శాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.

34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

రాజమండ్రి: ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులుగా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరపున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలం వెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల



రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని గాలివీడు మండలంలో నిర్మించిన వెలిగల్లు ప్రాజెక్టు నుంచి శుక్రవారం నీళ్లు విడుదల చేశారు.గాలివీడు మండలం గుండ్లచెరువు గ్రామం, దుగ్గనవారిపల్లి గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వెలిగల్లు కుడి కాలువ నుంచి పైపులైన్ ద్వారా చెరువుకు నీటిని పంపింగ్ చేసే కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు.ఈ నీటి సరఫరా ద్వారా చెరువు కింద ఉన్న పంట పొలాలు సాగులోకి వచ్చి, రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు వ్యవసాయ అభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడనుంది. గ్రామస్తుల విజ్ఞప్తికి స్పందించి సాగునీటి సౌకర్యం కల్పించడంపై స్థానిక రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని సరస్వతిపల్లి గ్రామంలో నాయనివారిపల్లి నుండి ఉడుంవారిపల్లి వరకు దాదాపు 40.00 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సిమెంట్ రోడ్డుకు భూమిపూజా చేసిన రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ "మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి".సరస్వతిపల్లి గ్రామ ప్రజల సౌకర్యం మేరకు నాయనివారిపల్లి నుండి ఉడుంవారిపల్లి వరకు నూతన సిమెంట్ రోడ్డు వేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు రమేష్ రెడ్డి, వినోద్ రెడ్డి మరియు పలువురు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రాయచోటి (ఎస్.ఎన్. కాలనీ): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి× 49 మంది లబ్ధిదారులకు సుమారు రూ.47 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కష్టాలను తన కష్టాలుగా భావించి, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని బీసీ కాలేజ్ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.2.50 లక్షల విలువైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లను పంపిణీ చేశారు.ఇటీవల రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి జన్మదినం సందర్భంగా బీసీ కాలేజ్ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు అవసరమైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు అందించాలని కోరగా, వారి విజ్ఞప్తి మేరకు మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఈ కార్యక్రమానికి ముందుకొ చ్చింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించిన వస్తువులను హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులతో కలిసి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తమ వంతు సహకారంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజం పట్ల సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు.

అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలించిన మంత్రి కొల్లు



మచిలీపట్నం : మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్ధాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదని కలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం

విజయవాడ : నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మల్లికార్జున పేట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు మాజీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్యామ్, హెల్త్ సూపర్ వైజర్స్ సిహెచ్ పిచ్చేశ్వరరావు, శివ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం

- ప్రతి సమస్యకు నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కారం: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు : జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే" కార్యక్రమంలో ఈరోజు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పాల్గొని, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నుండి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు మరియు ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రతి వినతిని జిల్లా ఎస్పీ గారు స్వయంగా పరిశీలించి, శాఖ నిబంధనలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో మరింత సామర్థ్యం, నిబద్ధత, ఉత్సాహం పెరుగుతాయని పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతులు, ఇతర పరిపాలనా నిర్ణయాలు శాఖ నిబంధనలు, ఖాళీలు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు.పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించిన ఎస్పీ గారు, సిబ్బంది సంక్షేమం మెరుగుపడితేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించగలమన్నారు.

అదేవిధంగా ప్రతి పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావంతో వ్యవహరించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం, భద్రతాభావం మరింత పెంపొందేలా సేవలందించాలని సూచించారు. "పోలీస్ శాఖ ఒక కుటుంబం. పరస్పర సహకారం, సమన్వయం, పరస్పర గౌరవంతో పనిచేసినప్పుడే సంస్థ మరింత బలోపేతం అవుతుంది. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని పేర్కొన్నారు..

పెరిగిన ఆర్టీసీ ఎన్నికల వేడి



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో గుర్తింపు సంఘం ఎన్నికల వాతావరణం వేడెక్కింది. సుదీర్ఘ కాలం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలు కేవలం కార్మిక సంఘాల హక్కుల సాధన కోసమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సుమారు 39వేల మందికి పైగా ఆర్టీసీ కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందుకే రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఈ ఎన్నికలు ప్రభావితం చేసే అవకాశం ఉందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు పదేళ్ల విరామం తర్వాత కార్మికులు రహస్య బ్యాలెట్ ద్వారా తమ నాయకులను ఎన్నుకోనుండటంతో ప్రతిష్టాత్మకంగా మారింది. ఈసారి ఎన్నికల్లో కార్మిక సంఘాలు విభిన్న కూటములుగా ఏర్పడి బరిలో నిలిచాయి. ప్రధానంగా మూడు కూటములు ఏర్పడి హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో కూడిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఒక కూటమిగా ఏర్పడ్డాయి. టీజేఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ సంయుక్తంగా జేఏసీ గా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. అలాగే తెలంగాణ జాయింట్ మజ్దూర్ యూనియన్ , బహుజన్ వర్కర్స్ యూనియన్ తదితర సంఘాలు మరో కూటమిగా బరిలోకి దిగాయి. ఈ సంఘాల వెనుక ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రధాన రాజకీయ పార్టీల హస్తం ఉండటంతో ఈ ఎన్నికలు కార్మిక క్షేత్రాన్ని తలపించడం లేదు.. అసలుసిసలు రాజకీయ యుద్ధాన్ని తలపిస్తున్నాయి. అధికార పార్టీ మద్దతు ఉన్న యూనియన్లు ఒకవైపు, ప్రతిపక్షాల బలంతో మరికొన్ని యూనియన్లు కార్మికులను ఆకట్టుకునేందుకు విభిన్న వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రచార పర్వం ఊపందుకోవడంతో కార్మిక సంఘాలు మేనిఫెస్టోలను, భారీ డిమాండ్ల పత్రాన్ని విడుదల చేశాయి. ప్రధానంగా 40 డిమాండ్లతో కూడిన చార్టర్‌ను జేఏసీ విడుదల చేయగా, అన్ని కూటములు కూడా ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, వేతన సవరణ అమలు, ఏప్రిల్ 1, 2025 నుంచి రావాల్సిన వేతన సవరణ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న 2017, 2021 బకాయిల చెల్లింపు వంటి కీలక అంశాలను తెరపైకి తెచ్చాయి. అలాగే తార్నాక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, ప్రావిడెంట్ ఫండ్ బకాయిల క్రమబద్ధీకరణ, కొత్త బస్సుల కొనుగోలు, డిపోల అభివృద్ధి వంటి హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని చెప్పుకుంటూ నాయకులు డిపోల వారీగా ప్రచార సభలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం యూనియన్ గుర్తింపుకే పరిమితం కాకుండా, కార్మిక వర్గంలో ఏ పార్టీకి పట్టుందనే దానికి నిదర్శనంగా మారుతాయి. ప్రభుత్వ విధానాలపై కార్మికుల్లో ఉన్న అభిప్రాయాన్ని ఈ బ్యాలెట్ బాక్సులు ప్రతిబింబించే అవకాశం ఉంది. ఉద్యోగుల సంక్షేమం కోసం గతంలో జరిగిన సమ్మెలు, ఆందోళనలు, ప్రభుత్వంతో జరిగిన చర్చలు అన్నీ నేడు ఓటర్ల మదిలో మెదులుతున్నాయి. ఒకవైపు కార్మికుల హక్కుల పరిరక్షణ, మరోవైపు రాజకీయ ఆధిపత్య పోరు మధ్య నడుస్తున్న ఈ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో నూతన సమీకరణాలకు తెరలేపడం ఖాయంగా కనిపిస్తోంది. అక్టోబర్ 9న జరగనున్న ఈ ఎన్నికల్లో కార్మికులు ఎవరి వైపు మొగ్గు చూపుతారు, ఏ కూటమి విజయధ్వజం మోగిస్తుంది అనేది వేచి చూడాలి

మాటల యుద్ధం.... కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్



హైదరాబాద్, : సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై ఆరోపణలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్రమైన రాజకీయ యుద్ధానికి దారితీశాయి. ముఖ్యమంత్రి కుమార్తె నైమిషా రెడ్డి వ్యాపారాలు, ఆస్తులపై బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ చేసిన వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులు రాష్ట్రంలో కలకలం రేపాయి. ఇవి కేవలం రాజకీయ ఆరోపణలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇరు పార్టీల మధ్య వరిస్థితిని మరింత అగ్గి రాజేశాయి. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల పెట్టుబడులు, ఫార్మా కంపెనీలు, ఆస్తులపై బీఆర్ఎస్ తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ముఖ్యంగా మెడికవర్ హాస్పిటల్స్, కార్ల షోరూంలు, కార్పొరేటే స్కూల్స్ అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం, పోస్టర్లు, బ్యానర్లు వేయడం పెద్ద దుమారం రేపింది. ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం.. సీఎం కుటుంబ సభ్యుల వ్యక్తిగత అంశాలను తెరపైకి తెచ్చి ఆరోపణలు గుప్పించడం అధికార వర్గానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఈ ఆరోపణలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఖండించింది. సీఎం కుటుంబానికి ఎలాంటి సంబంధం లేని వ్యాపారాలను ఆపాదించడం ద్వారా బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని తెలిపింది. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలని బీఆర్ఎస్ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ఈ వివాదం రాజకీయ వేదికల నుంచి పోలీస్ స్టేషన్లు, హైకోర్టు వరకు చేరింది. సీఎం కుటుంబంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, క్రిశాంక్ అరెస్ట్ పరిణామాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. సికింద్రాబాద్ కోర్టు ఆయన రిమాండ్‌ను తిరస్కరించడం, ఆ తర్వాత ఆయన తరపున హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు కావడం, హైకోర్టు పోలీసులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించడం వంటి పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి ముందుగా ప్రాథమిక విచారణ జరపాలని న్యాయస్థానం స్పష్టం చేయడం పోలీసుల తీరుపై చర్చకు దారితీసింది. ఈ మొత్తం ఉదంతంలో బీఆర్ఎస్ పార్టీ దూకుడు పెంచింది. ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై ప్రశ్నించడంలో విఫలమయ్యామనే విమర్శల నుంచి దృష్టి మళ్లించేందుకే ఆ పార్టీ ఇలా చేస్తోందనే ఆరోపణలు లేకపోలేదు. అయితే.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ఆ పార్టీ నేతలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ దీనిని తీవ్రంగా తిప్పికొడుతోంది. రాజకీయంగా ఎదుర్కొలేకనే ప్రతిపక్షం నీచ రాజకీయాలకు దిగుతోందని, కుటుంబ నభ్యులను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని మండిపడుతోంది. రేవంత్ రెడ్డి కుమార్తె ఆస్తులు, వ్యాపారాల అంశాన్ని తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ రాజకీయం చేయాలని చూస్తున్నప్పటికీ, ఇది ఆ పార్టీకి కత్తి మీద సాములా మారింది. ఒకవైపు ఆధారాలు చూపాలని అధికార పక్షం సవాలు విసురుతుండగా, మరోవైపు చట్టపరమైన చిక్కులు, న్యాయస్థానాల జోక్యం నేపథ్యంలో ఈ వివాదం రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోం

తెలంగాణలో రోడ్డు ప్రమాదాలనివారణకు 4 ఈ

హైదరాబాద్: తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు 4ఇ విధానాన్ని అమలు చేయనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్ అంశాల ఆధారంగా కార్యాచరణ చేపట్టనున్నారు. అధిక ప్రమాదాలు నమోదవుతున్న ఏడు జిల్లాల్లో ప్రమాదాల కారణాలను విశ్లేషించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించడంతోపాటు రహదారుల్లోని లోపాలను గుర్తించి సరిచేయాలని సూచించారు. కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, అధికారులు, సేవ్ ఫౌండేషన్ ప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్స్‌లో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. రోడ్డుప్రమాదాలు, వాటి కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్యను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 4ఇ విధానాన్ని అమలు చేయనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. రోడ్డు భద్రతను నాలుగు కీలక అంశాలుగా విభజించి సమగ్ర చర్యలు చేపట్టడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటికి కారణాలను విశ్లేషించి, మరణాలను తగ్గించేలా జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు. డీజీపీ కార్యాలయం నుంచి రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి ఏడు జిల్లాల కలెక్టర్లు, నలుగురు పోలీస్ కమిషనర్లు, సంబంధిత యూనిట్ అధికారులు, సేవ్ ఫౌండేషన్ ప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. టార్గెట్ జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్స్ ఇన్ తెలంగాణ అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఆయా జిల్లాల్లో ప్రమాదాల తీవ్రత, కారణాలు, నివారణ చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 100 జిల్లాలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు డీజీపీ తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన ఏడు జిల్లాలు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ఈ జిల్లాల్లో ప్రతి ప్రమాదానికి సంబంధించిన కారణాలను లోతుగా విశ్లేషించి, ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బ్లాక్‌స్పాట్లు, రహదారి నిర్మాణ లోపాలు, సరైన సైన్‌బోర్డులు లేకపోవడం, వెలుతురు సమస్యలు వంటి అంశాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత క్షతగాత్రులకు అందే వైద్యం కూడా ప్రాణాలను కాపాడటంలో కీలకమని డీజీపీ పేర్కొన్నారు. ప్రమాద స్థలానికి అత్యవసర సేవలు త్వరగా చేరుకునేలా వ్యవస్థను బలోపేతం చేయాలని, ఆసుపత్రుల్లో గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా సమన్వయం పెంచాలని సూచించారు. అదే సమయంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, డ్రైవర్లలో అవగాహన, ప్రమాదకర డ్రైవింగ్‌పై కఠిన చర్యలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. 4ఇ అంటే ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్ అవగాహన (ఇటబీఇజీబితినీని): డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడం. ఇంజినీరింగ్ (ఇనిణతినివవతీతినిణ): ప్రమాదాలకు కారణమయ్యే రహదారి డిజైన్ లోపాలు, బ్లాక్‌స్పాట్లు, మలుపులు, వెలుతురు, సైన్‌బోర్డులు తదితర సమస్యలను గుర్తించి సరిచేయడం. అమలు (ఇనిటనీతీఇఎవవనిబి): వేగ పరిమితులు, హెల్మెట్, సీట్‌బెల్ట్, డ్రంక్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా చర్యలు తీసుకోవడం. అత్యవసర సహాయం (ఇఎవతీణవనిఇఎ రూబీజూజూనీతీబి): ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్, పోలీసు, వైద్య బృందాలు స్పందించేలా వ్యవస్థను బలోపేతం చేసి, క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లో అత్యవసర చికిత్స అందించడం.

కేబీఆర్ పార్క్ వివాదంలో రేవంత్ కార్నర్



హైదరాబాద్, : హైదరాబాద్‌లోనే అత్యంత కీలకమైన కేబీఆర్ జాతీయ పార్క్ చుట్టూ ఉన్న జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కారిడార్లలో ట్రాఫిక్ నివారణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ప్రారంభంలో ఊ-అమెఎ ప్రాజెక్టు కింద వందల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 14 రకాల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల సజావుగా నిర్వహణ కోసమే ఆగస్టులో పార్కు చుట్టూ రౌండ్ ది పార్క్ వన్ వే విధానాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పైలట్ ప్రాజెక్ట్‌గా అమల్లోకి తెచ్చారు. అయితే, ఈ వన్ వే పెట్టగానే ట్రాఫిక్ రద్దీ సడలిపోవడంతో, అసలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రతిపాదనలనే పక్కనబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఊహించని యూ-టర్న్ నిర్ణయం ప్రభుత్వంపై తీవ్ర విమర్శల తుఫానును తెచ్చిపెట్టింది. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు అర్బన్ ప్లానర్లు కేవలం వన్ వే విధానంతోనే ట్రాఫిక్ తగ్గుతుందని తెలియడానికి రూ. వందల కోట్ల అంచనా వ్యయాలు, ప్రణాళికలు దేనికి? అని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్ట్ పేరు చెప్పి పార్క్ చుట్టుపక్కల ఇప్పటికే అనేక చెట్లను నరికివేయడం, రోడ్లను తవ్వేసి మౌలిక వసతులను ధ్వంసం చేయడం వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని మండిపడుతున్నారు. సరైన ముందస్తు అధ్యయనం లేకుండా నిధులు వెచ్చించి పనులు మొదలుపెట్టి, ఇప్పుడు సింపుల్ పరిష్కారం లభించింది అని చెప్పి ప్రాజెక్ట్ పక్కన పెట్టడం అనాలోచిత విధానానికి పరాకాష్ట అని విమర్శిస్తున్నారు. మరోవైపు, పౌరులు, వాహనదారుల నుండి కూడా ఈ వన్ వే పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రౌండ్ తిరగడం వల్ల జంక్షన్ల వద్ద సిగ్నల్ రహిత ప్రయాణం సాగుతున్నప్పటికీ, చిన్న దూరాలకు కూడా కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిరగాల్సి రావడం వల్ల అదనపు సమయం, ఇంధనం వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు యూ-టర్న్ వద్ద కొత్త తరహా ట్రాఫిక్ చిక్కులు వచ్చిపడుతున్నాయని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వన్ వే వల్ల సర్దుబాటు అయినా, భవిష్యత్ హైదరాబాద్ ప్రజావసరాలకు ఇది సరిపోతుందా? నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాల సంఖ్యను బట్టి చూస్తే, రాబోయే 5 నుండి 10 ఏళ్లలో కేబీఆర్ పార్క్ చుట్టూ వాహనాల రద్దీ రెట్టింపు కావడం ఖాయం. ఒక సాధారణ పోలీస్ ఆర్డనైజ్డ్ వన్ వే లూప్ తాత్కాలిక ఊరటనిస్తుందే తప్ప, పెరుగుతున్న భవిష్యత్తు నగర అవసరాలకు ఇది ఏమాత్రం శాశ్వత పరిష్కారం కాదని రవాణా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇలా ముందస్తు ఆలోచనలు లేకుండా నిర్ణయాలు సవరించుకోవడం వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్లానింగ్ తీరుపై నమ్మకం సడలుతోంది. ఒకవైపు ప్రజాధనం వృథా కాగా, మరోవైపు భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా మౌలిక వసతుల నిర్మాణం నిలిచిపోవడం వల్ల దీర్ఘకాలంలో నగర ప్రజలే నష్టపోతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తాత్కాలిక సర్దుబాట్లతో సరిపెట్టకుండా, పర్యావరణాన్ని కాపాడుతూనే భవిష్యత్తు వాహన రద్దీని తట్టుకునేలా సింగిల్ ఎలివేటెడ్ కారిడార్ లేదా లోతైన సైంటిఫిక్ ప్లానింగ్‌తో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. లేనిపక్షంలో ఈ 'వన్ వే ప్రయోగం' ప్రజాధనాన్ని వృథా చేసిన మరో విఫల వ్యూహంగా చరిత్రలో మిగిలిపోతుందనడంలో సందేహం ఉండదని అంటున్నారు.

మగపిల్లల్ని వదలట్లేదు....

హైదరాబాద్, : తెలంగాణలో బాలురపై లైంగిక వేధింపుల కేసులు తీవ్ర ఆందోళన కలిగించే స్థాయిలో వెలుగులోకి వస్తున్నాయి. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదైనట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. గతేడాది నమోదైన 61 కేసులను కేవలం 9 నెలల్లోనే ఈ సంఖ్య దాటినట్లు సమాచారం. తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన పోక్సో చట్టం కింద 2024 నుంచి 2026 సెప్టెంబర్ వరకు తెలంగాణలో మొత్తం 127 మంది బాలురు బాధితులుగా నమోదైనట్లు వెల్లడైంది. 2024లో కేవలం నలుగురు బాలురే బాధితులుగా నమోదవగా.. 2025లో ఆ సంఖ్య ఒక్కసారిగా 61కి పెరిగింది. 2026లో సెప్టెంబర్ నాటికే మరో 62 మంది బాలుర కేసులు నమోదయ్యాయి. అయితే కేసుల సంఖ్య పెరగడాన్ని లైంగిక దాడులు అదే స్థాయిలో పెరిగినట్లు నేరుగా అర్థం చేసుకోకూడదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం, బాధితులను గుర్తించడం, బాధిత కుటుంబాలు పోలీసులను ఆశ్రయించడం వంటి కారణాలతో గతంలో వెలుగులోకి రాని ఘటనలు ఇప్పుడు రికార్డుల్లోకి వస్తుండొచ్చని వివరిస్తున్నారు. 2025లో నమోదైన 61 మంది బాల బాధితుల్లో హైదరాబాద్‌లోనే 24 మంది ఉన్నారు. ఖమ్మంలో 13 కేసులు నమోదు అయ్యాయి. 2026 తొలి 9 నెలల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 9 మంది బాలురు బాధితులుగా నమోదయ్యారు. మిర్‌చౌక్, శంషాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో ఏడుగురు చొప్పున బాధితులు నమోదైనట్లు తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం వెల్లడించింది. గచ్చిబౌలి, హైదరాబాద్, కరీంనగర్, నిర్మల్, వరంగల్ ప్రాంతాల్లో మూడేసి కేసులు నమోదైనట్లు పేర్కొంది. బాలురపై లైంగిక వేధింపులు జరిగినప్పటికీ అనేక సందర్భాల్లో అవి బయటకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. కుటుంబం పరువు పోతుందని.. ఇలాంటి ఘటనలు బయటికి చెబితే సమాజం ఏమనుకుంటుందనే భయం.. అవమానాలు వంటి కారణాలతో కొందరు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని పేర్కొంటున్నారు. మరోవైపు.. తమకు ఎదురైన భయానక అనుభవాన్ని తమ తల్లిదండ్రులకు కూడా చెప్పేందుకు పలువురు బాలురు భయపడే పరిస్థితులు ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా నిందితుడు తమకు తెలిసిన వ్యక్తి అయినప్పుడు బాలుడు విషయాన్ని చెప్పడానికి మరింత ఇబ్బంది పడే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తాజాగా నమోదైన రెండు కేసుల్లోనూ బాధిత పిల్లలు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతోనే ఘటనలు వెలుగులోకి వచ్చాయి. చందానగర్‌కు చెందిన 4 ఏళ్ల బాలుడిపై అతను చదువుతున్న పాఠశాలలో పనిచేసే సెక్యూరిటీ గార్డు లైంగిక దాడికి పాల్పడిన ఘటన 2024 ఫిబ్రవరిలో జరిగింది. నల్లగండ్లలోని పాఠశాలలో పనిచేసే 30 ఏళ్ల సెక్యూరిటీ గార్డు.. బాలుడిని ఆడియో, విజువల్ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత బాలుడు జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పడంతో విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. కేసును విచారించిన ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది జూలైలో నిందితుడిని దోషిగా తేల్చింది. అతడికి 5 ఏళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు బాధిత బాలుడికి రూ. 1 లక్ష పరిహారం అందించాలని ఆదేశించింది. మరో ఘటనలో 10 ఏళ్ల బాలుడిపై అతడి పొరుగింట్లో ఉండే బంధువు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2023 డిసెంబర్‌లో కామాటిపుర పోలీసులు కేసు నమోదు చేశారు. 29 ఏళ్ల నిందితుడు టీవీ చూపిస్తానంటూ బాలుడిని తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఈ విషయం ఎవరికైనా చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బాలుడిని బెదిరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో కొంతకాలం బాలుడు మౌనంగా ఉన్నాడు. చివరకు నొప్పి, రక్తస్రావం రావడంతో జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు ఈ ఏడాది ఏప్రిల్‌లో నిందితుడిని దోషిగా నిర్ధారించి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. బాధిత బాలుడి తక్షణ అవసరాలు, వైద్యం, విద్య కోసం రూ. 75 వేల పరిహారం అందించాలని సిఫార్సు చేసింది. తెలంగాణలో బాలురపై లైంగిక నేరాలకు సంబంధించి నమోదైన గణాంకాలు సమస్యలో ఒక భాగాన్ని మాత్రమే చూపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. పోలీసుల వరకు చేరని ఘటనలు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పిల్లలు భయంతో, కుటుంబ సభ్యులు సామాజిక ఒత్తిళ్ల కారణంగా మౌనం పాటిస్తే నేరాలు అధికారిక రికార్డుల్లోకి ఎక్కవని చెబుతున్నారు. అందుకే బాలల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని.. పిల్లలు చెప్పే విషయాలను నిర్లక్ష్యం చేయకుండా వారి మాటలను నమ్మి స్పందించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తమకు తెలిసిన వ్యక్తుల నుంచే ప్రమాదం ఎదురయ్యే అవకాశాన్ని కూడా విస్మరించకూడదని చెబుతున్నారు. 2026లో కేవలం 9 నెలల్లోనే 62 మంది బాలురు పోక్సో కేసుల్లో బాధితులుగా నమోదవడం.. బాలుర భద్రత, అవగాహన, ఫిర్యాదు వ్యవస్థలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని మరోసారి ముందుకు తెచ్చింది.

భోపాల్ లో జైలు పరిపాలనలో మహిళా ఆఫీసర్లు సదస్సుకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్: మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చే జైలు వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ విషయంలో మహిళా జైలు అధికారుల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. జైలు పరిపాలనలో సాంకేతికత భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లోని పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలెప్ మెంట్ బ్యూరో లోని సెంట్రల్ అకాడమీ ఫర్ పోలీస్ ట్రైనింగ్ సిఏ పిటి కేంద్రంలో జైలు పరిపాలనలో మహిళా ఆఫీసర్లు అనే అంశంపై 5వ జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జైలు పరిపాలనలో మహిళా సిబ్బంది పాత్ర, సేవలు, వృత్తిపరమైన అభివృద్ధి, నాయకత్వం, జైలు పరిపాలనలో ఎదురవుతున్న కొత్త సవాళ్లు, ఉత్తమ విధానాలు వంటి అంశాలపై కేంద్ర మంత్రి ప్రారంభోవన్యాసం చేశారు. ఈకార్యక్రమంలో బీపీఆర్డీ డైరెక్టర్ జనరల్ అలోక్ మిత్తల్, ఐజీ అండ్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ అండ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ జితేంద్ర సింగ్ మీనా, పలువురు మహిళా జైలు ఉన్నతాధికారులు, విద్యా రంగ ప్రతినిధులు, జైళ్లు, సంస్కరణ పరిపాలనలో పనిచేస్తున్న నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు:ప్రజా పరిపాలనలో అత్యంత సవాళ్లతో కూడిన, సామాజికంగా ఎంతో ముఖ్యమైన రంగాల్లో పనిచేస్తున్న మహిళా అధికారుల కోసం ఇలాంటి జాతీయ వేదికను ఏర్పాటు చేసిన బీపీఆర్డీ అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. యూనిఫాం వెనుక ఉన్న మహిళలు ఉద్యోగ ఒత్తిడి, మానసిక ఆరోగ్యం, ఉత్తమ పద్ధతుల నుంచి సంస్థాగత మార్పుల వరకు, ఆదర్శ జైలు మాన్యువల్ మార్గదర్శకాల నుంచి ఆధునిక సంస్కరణాత్మక వ్యవస్థ వరకు, ఖైదీ తల్లులు వారి పిల్లలు నిర్బంధం నుంచి సంరక్షణ విషయంలో నిరంతర సహాయం వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, అమిత్ షా మార్గదర్శకత్వంలో జైలు సంస్కరణలకు కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జైళ్లను ఆధునీకరించడానికి, ఖైదీల పునరావాసం, సంస్కరణలకు సహాయం చేయడానికి అవసరమైన సహకారం అందిస్తున్నాం. అయితే, ప్రస్తుత జైలు చట్టాలు, నిబంధనలు, నియమాల్లో మార్పులు చేయడంలో ప్రధాన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. యూనిఫాం సేవల్లో మహిళల పాత్రలో గత కొన్నేళ్లుగా గణనీయమైన మార్పు వచ్చింది. మహిళలు క

దలాల్ స్ట్రీట్‌కు యూఎస్ టారిఫ్‌ల దడ



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్‌లు వరుసగా నాలుగో రోజూ భారీ నష్టాలను చవి చూశాయి. భారత్, చైనా వంటి దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారనే రిపోర్టులు దలాల్ స్ట్రీట్‌ను దారుణంగా పడిపోయేలా చేశాయి. మరోవైపు వెనిజులాపై యూఎస్ ఉగ్రదాడి మరిన్ని భౌగోళిక ఆందోళనలకు దారి తీయొచ్చనే మదుపర్ల అంచనాలు ముంచాయి. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు మరింత ఒత్తిడిని పెంచాయి. ఈ పరిణామాల మధ్య ఇటీవల ఎప్పుడూ లేని విధంగా గురువారం భారత మార్కెట్లు కుప్పకూలాయి. ఒక్క షూటలో మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు పైగా హరించుకుపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 84,778 నష్టాల్లో ప్రారంభం కాగా.. ఏ దశలోనూ కోలుకోకపోగా రోజంతా అమ్మకాల ఒత్తిడిని చవి చూసింది. ఇంట్రాడేలో 84,110 కనిష్టానికి పడిపోయింది. తుదకు 780.18 పాయింట్లు లేదా 0.92 శాతం పతనమై 84,180.96కు దిగజారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 263.9 పాయింట్లు లేదా 1.01 శాతం నష్టంతో 25,876.85కు పరిమితమయ్యింది. 2025 డిసెంబర్ 8 తర్వాత మార్కెట్లు అత్యధికంగా పడిపోవడం ఇదే తొలిసారి. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ మొత్తంగా 1600 పాయింట్లు, నిఫ్టీ 470 పాయింట్ల చొప్పున క్షీణించాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 1.96 శాతం, స్మాల్ క్యాప్ 1.99 శాతం చొప్పున పతనమయ్యాయి. అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. లోహ సూచీ అత్యధికంగా 3 శాతం కోల్పోగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 2.8 శాతం, పీఎస్‌యూ బ్యాంకింగ్ 2 శాతం, ఐటీ 1.9 శాతం చొప్పున కుదేలాయ్యాయి. ఒక్క సెషన్‌లోనే మదుపర్ల సంపద రూ.8.1 లక్షల కోట్లు తుడుచుకు పెట్టుకుపోవడంతో. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నేల చూపులు చూశాయి. హిందాల్కో ఇండస్ట్రీస్ 3.78 శాతం, జియో ఫైనాన్సియల్ 3.57 శాతం, ఓఎన్‌జీసీ 3.29 శాతం చొప్పున అత్యధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. బీఎస్ఈలో 4,367 స్టాక్స్ ట్రేడింగ్ కాగా.. 1,039 సూచీలు రాణించగా.. 3,158 స్టాక్స్ పతనమయ్యాయి. మరో 170 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి.ప్రతికూలాంశాలు..రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై
500 శాతం వరకు అదనపు సుంకాలు విధించడానికి వీలుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'శాంక్షనింగ్ ఆఫ్ రష్యా యాక్ట్ 2025' అనే బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇది భారత ఎగుమతిదారులు, ఇన్వెస్టర్లలో తీవ్ర ఆందోళన కలిగించింది. వెనిజులా అధ్యక్షుడు మదురోను అమెరికా దుర్మార్గంగా అరెస్ట్ చేయడం అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను పెంచింది. ఈ వ్యవహారంపై వెనిజులాకు రష్యా, చైనా సహా పలు లాటిన్ అమెరికా దేశాలు మద్దతును ఇవ్వడంతో పరిస్థితులు మరింత తీవ్రతరం కావొచ్చనే ఆందోళనలు ఇన్వెస్టర్లలో పెరిగా యి.దేశీయంగా దిగ్గజ సూచీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు ఈ వారంలో 4 శాతం వరకు నష్టపోయా యి. ఇండెక్స్‌లో వీటి వాటా ఎక్కువ కావడంతో, ఈ షేర్ల పతనం మొత్తం మార్కెట్‌లను ఒత్తిడికి గురి చేశాయి.

బ్యాంకు నుండి లోన్ తీసుకోవాలంటే శాలరీ మాత్రమే కాదు, ఇవీ ముఖ్యమే!



బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుండి చాలా మంది వివిధ అవసరాల కోసం బ్యాంకు నుండి లోన్స్ తీసుకుంటారు. వర్సనల్ లోన్,హోమ్ లోన్, గోల్డ్ లోన్ ఇలా పలు రకాల రుణాలను తీసుకుంటారు. రుణదాతలు కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని లోన్స్ జారీచేస్తాయి. బ్యాంకులు రుణాలు జారీ చేసేందుకు కేవలం శాలరీని మాత్రమే కాకుండా కొన్ని ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు రుణాలు జారీచేసేందుకు ఏయే అంశాలను పరిగణలోకి తీసుకుంటాయనే విషయాలు తెలుసుకుందాం!
బ్యాంకులు స్థిరమైన ఉద్యోగం ఉండే వారికి సాధారణంగా రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతారు. అయితే ఉద్యోగం, శాలరీ మాత్రమే కాకుండా మరికొన్ని ఇతర అంశాలను రుణదాతలు పరిగణలోకి తీసుకుంటారు.
సిబిల్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ
బ్యాంకులు లోన్ అప్రూవ్ చేయడంలో సిబిల్ స్కోర్ ఎంతో ప్రభావం చూపుతుంది. సాధారణంగా 750కి పైగా సిబిల్ స్కోర్ ఉంటే బ్యాంకులు సులభంగా లోన్స్ జారీచేస్తాయి. లేట్ పేమెంట్స్ ఒకే సమయంలో ఎక్కువ లోన్స్?కు అప్లై చేయడం వలన రుణదాతలు లోన్స్ ఇచ్చేందుకు ఆసక్తి చూపవు. మీ క్రెడిట్ హిస్టరీలో లోన్స్, క్రెడిట్ కార్డులు, పేమెంట్స్ వంటి ఎన్నో అంశాలు ఉంటాయి.
రుణదాతలు మీరు లోన్స్?కు అప్లై చేసిన సమయంలో డెబ్ట్-టు-ఇన్?కమ్ రేషియోను బ్యాంకులు చెక్ చేస్తాయి. మీ ఆదాయంలో 40 నుండి 50 శాతాన్ని అప్పులు చెల్లిస్తున్నందుకు వినియోగిస్తుంటే, బ్యాంకులు మీకు కొత్తగా అప్పులు ఇచ్చే అవకాశం లేదు. పాత లోన్స్ తీర్చడం వలన కొత్తగా లోన్ పొందే అవకాశం పెరుగుతుంది.
రుణగ్రహీత వయస్సు, రీపేమెంట్ కెపాసిటీ
బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు వంటి రుణదాతలు సాధారణంగా తక్కువ వయస్సు ఉన్నవారికే లోన్స్ ఇచ్చేందుకు ఆసక్తి చూపుతాయి. సాధారణంగా 21 నుండి 60 ఏళ్ల లోపు వారికి లోన్స్ ఇస్తారు. వయస్సు ఆధారంగా రుణగ్రహీత రీపేమెంట్ కెపాసిటీని అంచనా వేస్తారు. పర్సనల్ లోన్ అప్రూవల్ అనేది ఆదాయం, క్రెడిట్ స్కోర్, స్థిరమైన ఉద్యోగం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.
లోన్ పొందాలంటే కనీస ఆదాయం ఎంత ఉండాలి? బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుండి సులభంగా లోన్ అప్రూవల్ పొందాలంటే నెలకు రూ.15,000 నుండి రూ.25,000 వేతనం ఉండాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. అయితే రుణగ్రహీత నివసించే ప్రాంతం గ్రామీణ ప్రాంతం / పట్టణ ప్రాంతంపై ఆధారపడి ఉంటుంది. దీనితో పాటు స్వయం ఉపాధి పొందే వ్యక్తులకు స్థిరమైన ఆదాయం ఉండదు కాబట్టి ఇతర ఆదాయ మార్గాలకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. కొన్ని సందర్భాల్లో రుణదాతలు లోన్స్ జారీచేసేందుకు ఆదాయం మాత్రమే కాకుండా, రుణగ్రహీత నివసించే ప్రదేశాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటారు. రుణాలు పొందాలనుకునే వ్యక్తికి ఉద్యోగం, శాలరీ స్లిప్స్ వంటివి లేకపోతే సిబిల్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఇతర ఆదాయా మార్గాలను పరిగణలోకి తీసుకుంటారు. ఉద్యోగం లేదా శాలరీ స్లిప్స్ లేనివారికి లోన్స్ జారీచేసేందుకు రుణదాతలు సిబిల్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటాయి.

తిరిగి పుంజుకుంటున్న రూపాయి..

ఒక్క రోజే 97 పైసలు జంప్




గత కొద్ది రోజులుగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఒత్తిడిని ఎదుర్కొన్న భారత రూపాయి, ఎట్టకేలకు తిరిగి పుంజుకుంది. అమెరికన్ డాలర్ విలువ స్వల్పంగా బలహీనపడటం, దేశీయ మార్కెట్లలోకి పెట్టుబడులు తిరిగి రావడంతో రూపాయి మారకం విలువ ఒక్క రోజే 97 పైసలు బలపడింది. దీనితో ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89.27 వద్ద కొనసాగుతోంది. ఈ రికవరీ ఎగుమతిదారులు, దిగుమతిదారులకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తోంది. అమెరికా ఆర్థిక విధానాల్లో మార్పులు. గ్లోబల్ మార్కెట్ పరిస్థితులు భారత్‌కు అనుకూలంగా మారడమే రూపాయి బలోపేతానికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత కొద్ది నెలలుగా రూపాయి విలువ చారిత్రాత్మక కనిష్ట స్థాయిలకు పడిపోయి ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఈ డిసెంబర్ నెలలోనే రూపాయి విలువ తొలిసారిగా రూ. 91 మార్కును దాటి 91.14 వద్ద ఆల్‌టైమ్‌లో రికార్డును తాకింది. అమెరికా విధించిన 50 శాతం దిగుమతి సుంకాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడిదారుల ఉపసం హరణ రూపాయిని పాతాళానికి నెట్టాయి. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమయానుకూలంగా జోక్యం చేసుకుని డాలర్లను విక్రయించడం, తాజాగా డాలర్ ఇండెక్స్ తగ్గడంతో రూపాయి మళ్ళీ 90 మార్కు దిగువకు చేరి బలమైన స్థితిలోకి రావడం విశేషం.

2026లో 12 కోట్ల మంది ప్రయాణిస్తారు

త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్న నవీ ముంబయి విమానాశ్రయం సహా తమ ఎనిమిది విమానాశ్రయాల్లో వచ్చే ఏడాది 12 కోట్ల మంది ప్రయాణిస్తారని అదానీ ఎయిర్‌పోర్ట్స్ అంచనా వేస్తోంది. నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ డిసెంబరు 25న ప్రారంభం కానున్న నేపథ్యంలో అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్(ఏఏహెచ్ఎల్) డైరెక్టర్ జీత్ అదానీ పీటీఐతో మాట్లాడారు. విదేశాల్లో ఆస్తుల కొనుగోళ్లను పరిశీలించాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా అన్నారు. దేశీయ మార్కెట్‌పైనే ప్రస్తుతం దృష్టి సారించినట్లు వివరించారు. 'గతేడాది 8-9 కోట్ల మంది ప్రయాణికులు ఏడు విమానాశ్రయాల నుంచి తమ గమ్యస్థానాలకు చేర్చాయి. ఈ ఏడాది 10 కోట్లకు చేరొచ్చు. వచ్చే ఏడాది నవీ ముంబయి విమానాశ్రయం వల్ల ఈ సంఖ్య 12 కోట్లకు చేరుతుంద'ని చెప్పుకొచ్చాయి. ప్రస్తుతం ఏఏహెచ్ఎల్ చేతిలో ముంబయి, అహ్మదాబాద్, తిరువనంతపురం, జైపుర్, లఖ్‌నవూ, గువాహటి, మంగళూరు విమానాశ్రయాలున్నాయి. ఈ ఏడాది అక్టోబరులో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఈ నెల 25న వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించనుంది.

ఏడాదికి ఒకేసారి..

టోల్ ఛార్జీ రూ.15 మాత్రమే




జాతీయ రహదారులపై ప్రయణించే ప్రైవేట్ వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం వార్షిక పాస్‌లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. చాలా తక్కువ ధరకే ఎక్కువ సార్లు టోల్ గేట్లను దాటేందుకు అవకాశం కల్పిస్తోంది.వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్‌లకు భారీ స్పందన లభించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా వెల్లడించారు. వాహనదారులు పెద్ద సంఖ్యలో వార్షిక ఫాస్ట్ ట్యాగ్‌లను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. టోల్ గేట్ల వద్ద అధిక ఛార్జీలను తగ్గించుకునేందుకు వార్షిక ఫాస్ట్ ట్యాగ్‌లు ఎంతగానో ఉ పయోగపడతాయన్నారు. ఈ ఏడాది ఆగస్టు నెలలోనే కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాసులను కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది.
ఈ నాలుగు నెలల కాలంలోనే 40 లక్షల వార్షిక ఫాస్టా ట్యాగ్ పాస్‌లు జారీ చేసినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కర తెలిపారు. 2026 నాటికల్లా దేశ వ్యాప్తంగా ఆటో మేటిక్ టోల్ కలెక్షన్ పద్ధతి అమలు కానున్నట్లు తెలిపారు. టోల్ ఛార్జీ కేవలం రూ. 15 పడుతోందని, చాలా తక్కువ ధరకే ప్రైవేట్ వాహనదారులు టోల్ గేట్లను దాటేందుకు అవకాశం లభిస్తుందన్నారు. వార్షిక టోల్ పాస్ కింద ఒకేసారి రూ. 3000 చెల్లిస్తే సరిపోతుంది. ఏడాది మొత్తం ఉపయోగించుకోవచ్చు.

ఇప్పుడు అందరి దృష్టి ఆ ఇండస్ట్రీ వైపు మళ్లింది...!



కోలీవుడ్‌స్టార్ హీరోయిన్ శృతి హాసన్ ఇటీవల ఒక ఈవెంట్‌లో పాల్గొని మలయాళ సినిమా పరిశ్రమపై, తన డ్రీమ్ ప్రాజెక్ట్స్ గురించి ఆసక్తికర మైనవిషయాలు పంచుకున్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. తనకు మలయాళ సినిమాలంటే చాలా ఇష్టమని, ఎప్పటికైనా ఒక మలయాళ చిత్రంలో నటించాలనిఉందని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను మలయాళ సినిమాలకు వీరాభిమానిని అని, అప్పుడప్పుడు అక్కడి సినిమాలు చూస్తుంటానని తెలిపారు. అయితే ఇటీవల ఏ సినిమా చూశానని మాత్రం తనను అస్సలు అడగవద్దని అన్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో భాగం కావాలనేది తన చిరకాల కోరిక అని, ఇప్పటివరకు ఆ అవకాశం కుదరలేదని చెప్పారు. అయితే దీనికి సమయం ఇంకా మించిపోలేదని, సరైన కథ దొరికితే వెంటనే మలయాళంలో నటిస్తానని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుత సినిమా ఇండస్ట్రీ ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. ఒకప్పుడు అందరి చూపు బాలీవుడ్ వైపు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ రోజులు పూర్తిగా మారిపోయాయని అన్నారు.

వైవిధ్యభరితంగా 'భోగి'..



హీరో శర్వా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు.హీరో, అతని ప్రేమకథకు సంబంధించిన పాత్రలను పరిచయం చేయడమే కాకుండా.. ఒక రా, ఇంటెన్స్, రూటెడ్, ర్యాజింగ్ ప్రపంచానికి టీజర్ ప్రజెంట్ చేసింది. 1960ల ప్రారంభంలో తెలంగాణ? మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తాజాగా మేకర్స్ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. హీరో, అతని ప్రేమకథకు సంబంధించిన పాత్రలను పరిచయం చేయడమే కాకుండా.. గంగగా శర్వాతోపాటు అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి పాత్రల తీరుని టీజర్‌లో చూపించారు.

తన దగ్గర ప్రస్తుతం 26 కథలు సిద్ధంగా ఉన్నాయి...



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు మిస్కిన్ తనదైన శైలీలో సినిమాలను తెరకెక్కిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అయితే ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లు 'పిశాచి-2', 'ట్రైన్' సినిమాలు షూటింగ్ పూర్తి చేసుకుని చాలాకాలం అవుతున్నప్పటికీ, వివిధ కారణాల వల్ల విడుదల నోచుకోకుండా వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యం లో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మిస్కిన్ తన సినిమాల విడుదలపై, భవిష్యత్తు ప్రాజెక్ట్‌లపై స్పందిస్తూ ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. తన సినిమాల రిలీజ్ గురించి మిస్కిన్ మాట్లాడుతూ.. 'పిశాచి 2', 'ట్రైన్' చిత్రాలు విడుదలవుతాయా లేదా అనే దాని గురించి తాను ఇప్పుడు ఎలాంటి ఆందోళన చెందడం లేదని స్పష్టం చేశారు. ఆ రెండు సినిమాల పని ఎప్పుడో ముగిసిందని, వాటి గురించి తాను ప్రస్తుతం ఆలోచించడం లేదని తేల్చిచెప్పారు. అంతేకాకుండా నటుడు నరైన్‌తో 'అంజాతే 2' సినిమా చేయాలని నిర్ణయించుకున్నానని, ఆ తర్వాత 'ఇచ్చై' అనే పేరుతో మరో కథ సిద్ధంగా ఉందని, ప్రస్తుతం దాన్ని మరింత మెరుగుపరిచే పనిలో ఉన్నానని చెప్పారు. ఇవే కాకుండా మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కోసం కూడా త్వరలో ఒక కథ రాయబోతున్నట్లు మిస్కిన్ తెలిపారు. మొత్తంగా తన దగ్గర ప్రస్తుతం 26 కథలు సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తన డ్రీమ్ ప్రాజెక్ట్స్ గురించి మాట్లాడుతూ.. ఒకప్పుడు తాను లోకనాయకుడు కమల్ హాసన్ కోసం ఒక కథ రాశానని, అప్పట్లో అదే తన కలల ప్రాజెక్ట్ అని భావించానని గుర్తుచేసుకున్నారు. కానీ కమల్ గారితో కొన్ని కారణాల వల్ల మనస్పర్థలు, సమస్యలు తలెత్తడంతో ఆ ప్రాజెక్ట్‌ను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు తెలిపారు. అప్పుడే తనకు ఒక విషయం అర్థమైందని, బహుశా అది కేవలం తన ఊహలో మాత్రమే డ్రీమ్ ప్రాజెక్ట్‌గా ఉండి ఉంటుందని అనుకున్నానని చెప్పారు.

ఇది నాకు అత్యంత అవమానకరమైన విషయం



జాన్వీ కపూర్ ఎట్టకేలకు ఏఐ దుర్వినియోగంపై స్పందిస్తూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంచలన పోస్ట్ పెట్టారు. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' చిత్రంలోని సూపర్ హిట్ సాంగ్ 'చుట్టమల్లె' పాటకు సంబంధించి ఒక ఏఐ మార్ఫింగ్ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేయడం తీవ్ర కలకలం రేపింది. ఇక ఈ విషయంపై ఎన్టీఆర్‌తో పాటు సినీ సెలబ్రిటీలంతా సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com